ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 02 సంచిక -291 పేజీలు - 8 వెల - 03/- గురువారం 5 ఫిబ్రవరి 2026

# మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా వెనుకబడిన వర్గాలు..

## కార్యాచరణ సిద్ధం చేయాలన్న సీఎం చంద్రబాబు



**ఆదరణ-3 ద్వారా కులవృత్తులకు ఆధునిక పరికరాల పంపిణీకి చర్యలు**

**రూ.60 కోట్ల సాస్కీ నిధులతో బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం**

**బీసీ హాస్టళ్లలో మార్చిలోగా ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం**

**6 జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్**

**అమరావతి, ఫిబ్రవరి 04( రిపబ్లిక్ న్యూస్) :-** వెనుకబడిన వర్గాలను (బీసీ) కేవలం సంక్షేమ లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని సూక్ష్మ పారిశ్రామికవేత్తలుగా (మైక్రో ఎంట్రప్రెన్యూర్లు), ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మిగతా 2లో...



# రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తోంది

## అంబటి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సీఎం జగన్

**అంబటి, జోగి రమేష్ ఇళ్లపై దాడులే నిదర్శనం**

**ఏడాదిన్నర కాలంగా ప్రజలను మభ్యపెడుతున్న బాబు**

**తిరుమల నెయ్యిలో జంతువు కొవ్వు అంటూ దుష్ప్రచారం**

**దేవుడంటే భయం, భక్తి లేకుండా రాజకీయాలు**

**కులమతాలను రెచ్చగొట్టేలా ఫ్లెక్సీల ఏర్పాటు అభ్యంతరకరం**

**గుంటూరు, ఫిబ్రవరి 04( రిపబ్లిక్ న్యూస్) :-** సీఎం చంద్రబాబు ఏడాదిన్నరగా కావాలనే ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమం చేపట్టారని సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మండిపడ్డారు. తిరుమల లడ్డు నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని రకరకాలుగా ప్రచారం చేశారని, చివరికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మిగతా 2లో...

# జిమ్‌ల ముసుగులో యువతులకు వల

## అన్ని రాష్ట్రాలు, కేంద్రానికి నోటీసులు జారీ చేసిన ఎన్ హెచ్ఆర్సీ

**యూపీలోని మీర్జాపూర్‌లో 50 మందికి పైగా బాధితులని ఫిర్యాదు**

**జిమ్‌ల నిబంధనలపై నివేదిక కోరిన మానవ హక్కుల కమిషన్**



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 04( రిపబ్లిక్ న్యూస్) :-** దేశవ్యాప్తంగా ఉన్న జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్ల ముసుగులో యువతులపై లైంగిక దోపిడీ, బలవంతపు మతమార్పిడులు జరుగుతున్నాయన్న తీవ్రమైన ఆరోపణలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్ హెచ్ఆర్సీ) తీవ్రంగా స్పందించింది. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదికలుమిగతా 2లో...

# అట్టుడికిన పార్లమెంట్ ఉభయసభలు

## ఆవరణలో 8 మంది సస్పెన్షన్ ఎంపీల ఆందోళన-లోక్‌సభలో వాయిదాల పర్వం

**ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ,ఇతర ఎంపీల మద్దతు**



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 04( రిపబ్లిక్ న్యూస్) :-** ఎప్‌స్టీన్ ఫైల్స్, ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకంలోని అంశాలు ఎక్కడ బయటపడతాయో అని కేంద్రం భయపడుతోందని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. బుధవారం ఉభయ సభల ఆరంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలోని మకర ద్వారం వద్ద సస్పెన్షన్‌కు గురైన ఎంపీలు ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఎంపీ ఎస్. వెంకటేషన్, కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాణిక్యం ఠాగూర్, ప్రశాంత్ పడోలే, హిబి ఈడెన్, డీన్ కురియకోస్, గుర్జీత్ సింగ్ ఔజ్లా, అమరీందర్ సింగ్ రాజా వారింగ్ పాల్గొన్నారు. ప్రధాని మోడీ, అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ('పీఎం ఈజ్ కాంప్రమైజ్డ్')తో రాజీపడ్డారనిమిగతా 2లో...

# కుట్రలకు చెక్ పెట్టేలా వ్యూహ రచన

## చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ

**తాజా రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చ**

**వైకాపా కుట్ర రాజకీయాలను తిప్పికొట్టడంపై దృష్టి**



**అమరావతి, ఫిబ్రవరి 04( రిపబ్లిక్ న్యూస్) :-**
ఏపీ సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ భేటీ ముగిసింది. సుమారు రెండున్నర గంటలపాటు వారిద్దరూ సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలపై చంద్రబాబు, పవన్ మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. కుల రాజకీయాలను వైకాపా రెచ్చగొడుతోందని.. ఆ కుట్రలను ఎదుర్కొనేందుకు, ఆ పార్టీ ట్రాప్‌లో పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని నేతలిద్దరూ నిర్ణయానికి వచ్చారు. దీనికోసం అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. మిగతా 2లో...



# న్యాయం ఏడుస్తోంది

## : సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ

**ఈసీపై సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ పిటిషన్**

**తన పిటిషన్ పై తానే వాదనలు వినిపించిన మమత**

**ఈసీపై తీవ్ర విమర్శలు గుప్పించిన మమత**

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 04( రిపబ్లిక్ న్యూస్) :-**
పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టులో ఎన్నికల సంఘం (ఈసీఐ)పై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) వోటర్ లిస్ట్‌పై సవాలు చేస్తూ ఆమె దాఖలుమిగతా 2లో...



# తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పవన్ ప్రచారం

**పవన్ కల్యాణ్ ను కలిసిన కిషన్ రెడ్డి, రాంచందర్ రావు**

**బీజేపీకి పవన్ మద్దతు ప్రకటించారన్న రాంచందర్ రావు**

**బీజేపీ తరపున ప్రచారం చేయడానికి అంగీకరించారని వెల్లడి**

హైదరాబాద్,, **ఫిబ్రవరి 04( రిపబ్లిక్ న్యూస్) :-**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ త్వరలో తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈనెల 7,8 తేదీల్లో బీజేపీకి మద్దతుగా పవన్ ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు బిజెపి నేతలకు హామీ ఇచ్చారు. మంగళవారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు రామచందర్‌రావు.. పవన్ కల్యాణ్‌ను కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మిగతా 2లో...

# బడ్జెట్ కసరత్తులో ఆర్థిక మంత్రి పయ్యావుల

## వివిధ శాఖల అధికారులతో ప్రీ-బడ్జెట్ సమాలోచనలు

**14న బడ్జెట్ సమర్పణకు ముమ్మరంగా కసరత్తు**

**అమరావతి, ఫిబ్రవరి 04( రిపబ్లిక్ న్యూస్) :-**ఈనెల 14వ తేదీన 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నేతృత్వంలో ఆ శాఖ అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. బడ్జెట్ కసరత్తులో భాగంగా మిగతా 2లో...



# రాష్ట్ర ప్రయోజనాల సాధనకు ఎంపీలు సమన్వయంతో పనిచేయాలి

## ఢిల్లీలో ఎంపీలతో సమావేశమైన రాష్ట్ర మంత్రి నారా లోకేష్



# న్యాయం ఏడుస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

చేసిన పిటిషన్‌పై సీజేఐ సూర్యకాంత్ ముందు వాదనలు జరిగాయి. "న్యాయం తలుపుల వెనక ఏడుస్తోంది" అంటూ మమత గట్టిగా అరిచారు. తాను మాట్లాడేందు ఐదు నిమిషాల సమయం ఇవ్వాలని కోరగా సీజేఐ అంగీకరించారు. 15 నిమిషాల పాటు మాట్లాడే అవకాశం ఇచ్చారు.

మమత తన వాదన మొదలు పెడుతూనే ఈసీఐపై మాటల దాడి చేశారు. ఆరు సార్లు లేఖలు రాశాను కానీ ఒక్క స్పందన రాలేదని, ఎక్కడా న్యాయం దొరకడం లేదని ఆరోపించారు. భాషా సమస్యలు, స్పెల్లింగ్ మిస్‌మ్యాచ్‌ల వల్ల మాత్రమే వోటర్లను తొలగించకూడదని వాదించారు. వివాహం తర్వాత ఇంటి పేరు మారిన మహిళల పేర్లను తొలగించారని తెలిపారు. ఆధార్‌ను ఆమోదించకపోవడం కోర్టు ఆదేశాల ఉల్లంఘన అని... ఇతర రాష్ట్రాల్లో డొమిసైల్, కుల సర్టిఫికెట్లు అంగీకరిస్తుంటే బెంగాల్‌ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు.ఎన్నికల ముందు 3 నెలల్లో ఎందుకు ఇంత హడావుడి? నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు ఉంటే ఎందుకు బెంగాల్‌ను మాత్రమే ఎంచుకున్నారు? అని ప్రశ్నించారు. బూత్ లెవల్ ఆఫీసర్ల మరణాలకు ూ×=తో సంబంధం ఉందని, హార్వెస్టింగ్ సీజన్‌లో 100 మందికి పైగా మరణాలు, హాస్పిటలైజేషన్లు జరిగాయని, అసోంలో ఎందుకు ఇలాంటివి లేవని విమర్శించారు. బెంగాల్‌ను "బుల్డోజ్" చేస్తున్నారని, ప్రజల హక్కులను కాపాడాలని ధర్మాసనాన్ని కోరుతున్నానని అన్నారు.జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, వీఎం పంచోలి బెంచ్ మమతా పిటిషన్ జెన్యూన్ అని అంగీకరించింది. ూ×= నోటీసులు పంపేటప్పుడు అధికారులు కాస్త సెన్సిబుల్‌గా ఉండాలని ఈసీకి సూచించింది. అమర్త్యా సేన్, జాయ్ గోస్వామి, టీఎంసీ ఎంపీ దీపక్ అధికారి వంటి ప్రముఖులకు నోటీసులు పంపడం గురించి ఆందోళన వ్యక్తం చేసింది. తదుపరి విచారణ సోమవారానికి వాయిదా వేసింది.మరోవైపు, మమత కోల్ కతాలోని జోగేశ్ చంద్ర చౌదరి కాలేజీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి సుప్రీంకోర్టులో సొంతంగా వాదనలు వినిపించడం ఇదే తొలిసారి.

# మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా వెనుకబడిన వర్గాలు..

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు అనుగుణంగా పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కులవృత్తుల వారికి ఆధునిక సాంకేతికతను అందించే లక్ష్యంతో 'ఆదరణ-3' పథకం ద్వారా ఆధునిక పనిముట్లను పంపిణీ చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.

విద్యా రంగంలో బీసీ విద్యార్థులకు అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించడంపై సమీక్షలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రూ.60 కోట్ల సాస్కీ నిధులతో కొత్తగా బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఉన్న 814 బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు రూ.17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హాస్టళ్లలో పారిశుధ్యం, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని, అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు.విద్యార్థుల ఆరోగ్యం, విద్యాబోధన వంటి అన్ని అంశాల్లోనూ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అనుసరించాలని సూచించారు. విద్యార్థుల విద్యాపరమైన పురోగతిని పర్యవేక్షించేందుకు వీలుగా అపార్ ఐడీలను నమోదు చేసి, అనుసంధానం చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న బీసీ భవనాల పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే పేరుతో నడుస్తున్న 6 రెసిడెన్షియల్ పాఠశాలలను జూనియర్ కళాశాలల స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు.రాబోయే రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఒక బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేసే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. బీసీ స్టడీ సర్కిళ్లను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని, కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, వారికి ప్రయోజనం చేకూరేలా పథకాలు రూపొందించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

కూడా అసత్య ప్రచారం చేశారని అసహనం వ్యక్తం చేశారు. దేవుడంటే ఏమాత్రం భయం, భక్తి లేకుండా రాజకీయాలు చేశారని ఫైర్ అయ్యారు. అంబటి రాంబాబు, జోగి రమేష్, విడదల రజని మీద దాడులు చేశారని.. వారు చేసిన తప్పేంటి? అని ప్రశ్నించారు. ఇదే ప్రభుత్వం ఎప్పుడూ ఉండదని, వచ్చే మూడేళ్లలో తమ ప్రభుత్వం వస్తుందని వైఎస్ జగన్ అన్నారు. టీడీపీ నేతల దాడిలో ధ్వంసమైన మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటికి వెళ్లి.. ఆయన కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు.వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ? 'రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తుంది. భయానక వాతావరణంలో పాలన జరుగుతుంది. అంబటి, జోగి రమేష్ ఇళ్లపై దాడులు చూస్తే జంజిల్ రాజ్యం ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది. అంబటి, జోగి, కాకాణిలు చేసిన తప్పేంటి?. ప్రశ్నిస్తున్నారని మా వాళ్ళపై దాడులు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు కుట్ర పూరితంగా జంతువుల కొవ్వు అని తప్పుడు ప్రచారం చేసాడు. ఆవు, పంది, చేప కొవ్వు అంటూ ఉద్దేశ్య పూర్వకాలంగా దేవుడి ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేసారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ గారికి దేవుడంటే భయం భక్తి లేవు. దుర్మార్గంగా తప్పుడు ప్రచారం చేశారు. కేంద్ర ల్యాబ్లు ఎలాంటి జంతువుల కొవ్వు లేదని రిపోర్ట్ ఇచ్చాయి. సీబీఐ అదే విషయాన్ని సుప్రీం కోర్టుకి రిపోర్ట్ ఇచ్చింది. తప్పు చేసి ఉంటే వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి పేర్లు సీబీఐ ఎందుకు చేర్చలేదు. సీబీఐ వాళ్లకు క్లీన్ చిట్ ఇచ్చింది. అసలు సీబీఐ విచారణ కావాలని సుప్రీమ్ కోర్టును కోరిందే వైవీ సుబ్బారెడ్డి. చంద్రబాబు, లోకేష్, పవన్లు చెంపలేసుకుని క్షమాపణ కోరాలి. క్షమాపణ చెప్పకుండా మళ్లీ అదే దుర్మార్గపు అపార్థాలను ప్రచారం చేస్తున్నారు' అన్గి ÷ర్ అయ్యారు.'సిగ్గు లేకుండా ప్లెక్సీలు వేయిస్తున్నారు. కుల మతాలను రెచ్చగొట్టే ప్లెక్సీలు పెట్టడం రాజ్యాంగ విరుద్ధం కాదా. ఇలానే మేము సూపర్ సిక్స్ అమలు చెయ్యలేదని ప్లెక్సీలు వేస్తే ఒప్పుకుంటారా. ప్లెక్సీలు పెట్టి ప్రజల్లో బావోగ్వేదాలు రెచ్చగొట్టేలా చెయ్యడం తప్పు కాదా?. ఇలాంటి దుర్మార్గాలను ప్రశ్నిస్తే మా వాళ్ళపై దాడులు చేయిస్తారా?. సీఎం చంద్రబాబుకి మంచి బుద్ధి ప్రసాదించాలని దేవుణ్ణి కోరి గుడి నుండి వస్తుంటే దాడులు చేసారు. అంబటి రాంబాబుని పోలీసుల సమక్షంలో కర్రలు పట్టుకుని కారుపై దాడికి పాల్పడ్డారు. కారులో ఉన్న రాంబాబుని దారుణమైన భూతులు తిడుతూ దాడి చేసారు. ఒక్కడే ఉండటం వల్ల అంబటి ఆగ్రహానికి గురయ్యారు. అలాంటి సమయంలో నోట్లో నుండి రెండు తిట్లు వచ్చాయి. ప్రాణం మీదకి వచ్చినప్పుడు వచ్చిన తిట్లే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా తిట్టలేదు. సంస్కారం ఉన్న వ్యక్తి కనుక ఆ మాటలు రావడంపై బాధపడి.. వివరణ ఇచ్చాడు. తిట్లు వచ్చినందుకు చింతిస్తూ వెనక్కి తీసుకున్నాడు. అలాంటి సంస్కారం ఉన్న అంబటిని చేతనైతే పొగడాలి.. కానీ దుర్మార్గంగా హత్య చెయ్యడానికి ప్రయత్నించారు. ఏకంగా 8 గంటల పాటు హత్యకు ప్రయత్నించారు. ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో పోలీసుల సమక్షంలో దాడి చేశారు. ఇంట్లో మహిళలను ఇష్టం వచ్చినట్లు తిడుతూ ఫర్నీచర్ పగలగొట్టారు. కార్లు ధ్వంసం చేసి.. ఆఫీస్ కి నిప్పు పెట్టారు. పోలీసులు బాధ్యతగా వ్యవహరించి ఉంటే ఇలాంటి దాడులు జరిగేవా?. డీజీపీ ఆఫీస్ కూతవేటు దూరంలో ఉంది.. పక్కనే బెటాలియన్ ఉంది.. కంట్రోల్ చెయ్యలేరా?. అధికారులకు ఫోన్లు చేసినా ఒక్కరు ఎత్తలేదు.. పక్కా ఎ÷-లాన్ ప్రకారం హత్యాయత్నం చేసారు' అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పవన్ ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్ ఎన్నికలు సహా పలు కీలక అంశాలపై ముగ్గురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా బీజేపీ తరపున ప్రచారంలో పాల్గొనాలని కిషన్ రెడ్డి, రామచందర్ రావు.. పవన్‌ను కోరారు. ఇందుకు పవన్ కల్యాణ్ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని రామచందర్ రావు స్వయంగా వెల్లడించారు. మంగళవారం ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పవన్ కల్యాణ్ గారిని కలవడం గౌరవంగా భావిస్తున్నా. తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలతో సహా ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా, అర్థవంతమైన చర్చలు జరిపాము. పవన్ కల్యాణ్ గారు భారతీయ జనతా పార్టీకి పూర్తి మద్దతు ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరపున ప్రచారం చేయడానికి అంగీకరించారు' అని తెలిపారు. కాగా, రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 11న ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత 13న ఫలితాలను వెల్లడించనున్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 ప్రకారం ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసి పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. బీజేపీ, జనసేన స్నేహపూర్వక పోటీ అంటూ ఈ మేరకు జనసేన పార్టీ ట్వీట్ చేసింది.

# కుట్రలకు చెక్ పెట్టేలా వ్యూహ రచన

(మొదటి పేజీ తరువాయి)

కిందిస్థాయిలో తెదేపా, జనసేన క్యాడర్ మధ్య చిచ్చుపెట్టేలా వైకాపా చేస్తున్న కుట్రలకు చెక్ పెట్టేలా పలు నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. త్వరలో ఖాళీ కానున్న 4 రాజ్యసభ స్థానాలపైనా చంద్రబాబు, పవన్ ప్రాథమికంగా చర్చించినట్లు తెలుస్తోంది. పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీపైనా సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. బుధవారం ఉదయం సీఎం నివాసానికి చేరుకున్నాక ఇద్దరి మధ్య సమావేశం మొదలైంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, సున్నితమైన అంశాలపై విపక్షం రెచ్చగొట్టే ప్రయత్నాలు, తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే రాజ్యసభ ఎన్నికలు, నియామక పదవులు, కూటమి పక్షాల సమన్వయం, వైసీపీ విషప్రచారాన్ని తిప్పికొట్టడంపై చర్చించనున్నట్లు సమాచారం.తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంపై ఈ సమావేశంలో చర్చ జరుగనున్నట్లు తెలుస్తోంది. తిరుమలకు ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్న నేపథ్యంలో.. వారి మనోభావాలను గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే గతంలో సీఎం మాట్లాడటం, విచారణకు ఆదేశించడం, అలాగే ఈ అంశంపై సుప్రీం కోర్టుకు పలువురు వెళ్లగా సీబీఐ నేతృత్వంలో సిట్ ఏర్పాటై ఈ వ్యవహారంపై విచారించడం జరిగింది. నెయ్యి కల్తీ జరగడం వాస్తవమని తేలడంతో.. ఇందులో ఎవరు సూత్రధారులు అనేదానిపై కేబినెట్‌లో చర్చించడంతో పాటూ కల్తీకి ఆస్కారం ఇచ్చిన వారంతా బాధ్యులే అని సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం.

# అట్టుడికిన పార్లమెంట్ ఉభయసభలు

(మొదటి పేజీ తరువాయి)

ప్లకార్డులు, భారీ బ్యానర్‌ను ప్రదర్శించారు. జనరల్ మనోజ్ కుమార్ నరవణె పుస్తకంతో పాటు నరేంద్ర మోడీ ఫొటోను ఆ బ్యానర్‌పై ముద్రించారు. ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ప్రతిపక్ష పార్టీల ఎంపీలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ.. ప్రజల కోసం మాట్లాడుతుంటే గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని బీజేపీ పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతులు నొక్కాలని చూస్తోందని అన్నారు. కానీ ప్రజాక్షేత్రంలో నిజాలు చెప్పకుండా ఎలా అడ్డుకోగలరని ప్రశ్నించారు. దేశ భవిష్యత్తును మోడీ తాకట్టు పెడుతున్న తీరు, ప్రజలకు కేంద్రం చేస్తున్న అన్యాయం, నష్టాన్ని ప్రజలకు వివరిస్తామని చెప్పారు. బీజేపీ చేసే తప్పులను అంగీకరిస్తేనేడ పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశం కల్పిస్తామనేలా ఎన్టీఏ సర్కార్ వ్యవహరిస్తోందన్నారు. దేశ శ్రేయస్సు, భవిష్యత్తు తరాల కోసం మాట్లాడేందుకు సభలో అవకాశం కల్పించకపోవడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ప్రతిపక్ష నేతకే మాట్లాడే అవకాశం ఇవ్వకుంటే, దేశం కోసం ప్రశ్నిస్తే మైక్ కట్ చేస్తుంటే.. ఇక సభలు నిర్వహించుకోవడం ఎందుకని, ఇదెక్కడి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు.

# బడ్జెట్ కసరత్తులో ఆర్థిక మంత్రి పయ్యావుల

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక మంత్రి వరుసగా ప్రీ-బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఐదు శాఖలకు చెందిన మంత్రులతో సమావేశాలు పూర్తయ్యాయి. మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవి కుమార్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, అనితలతో వరుస సమావేశాలు జరిపారు. ఈ సమావేశాల్లో ఆయా శాఖలకు నిధుల కేటాయింపులు, ప్రాధాన్యతలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. వివిధ శాఖల మంత్రులు తమ ప్రతిపాదనలను ఆర్థిక మంత్రికి సమర్పించారు. సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో నిధులు కేటాయించేలా ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఉత్తరాంధ్ర-రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించేలా బ్జడెట్ కూర్పు సాగుతోంది. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపులకు ఎస్క్రో ఖాతాలు తెరుస్తామని స్పష్టం చేశారు. ఈ బ్జడెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు సమాచారం. తల్లికి వందనం, దీపం-2.0, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి పథకాలకు ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. వివిధ వర్గాలకు అందించే సంక్షేమ పథకాలకూ రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించనున్నట్లు తెలుస్తోంది. రోడ్ల అభివృద్ధిపైనా ఈ బ్జడెట్‌లో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పాత హోల్స్ రోడ్లు, కొత్త రోడ్ల నిర్మాణానికి ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. హార్టికల్చర్ రంగ అభివృద్ధికి ప్రత్యేక కేటాయింపులు, లాజిస్టిక్స్ సెక్టార్ వృద్ధిపై సర్కార్ ప్రత్యేక ఫోకస్ పెట్టనుంది. అంతేకాకుండా, జల్ జీవన్ మిషన్ పథకాన్ని వేగవంతం చేసేందుకు తగిన ప్రణాళికలు, నిధుల కేటాయింపులు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బ్జడెట్ కేటాయింపులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం (ఫిబ్రవరి 3) చర్చలు జరిపారు. అలాగే మిగిలిన శాఖల మంత్రులతోనూ త్వరలో సమావేశాలు జరిగే అవకాశం ఉంది.

# రాష్ట్ర ప్రయోజనాల సాధనకు ఎంపీలు సమన్వయంతో పనిచేయాలి

### ఢిల్లీలో ఎంపీలతో సమావేశమైన రాష్ట్ర మంత్రి నారా లోకేష్

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 4)**రాష్ట్ర ప్రయోజనాల సాధనతో పాటు అభివృద్ధి లక్ష్యంగా అందరూ కలసికట్టుగా, సమన్వయంతో ముందుకు సాగాలని రాష్ట్ర ఐటీవిద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎంపీలకు సూచించారు. ఢిల్లీలో ఆయన నిర్వహించిన ఎంపీల సమావేశంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు.పలువురు కేంద్ర మంత్రులతో సమావేశాల సందర్భంగా ఢిల్లీలో పర్యటించిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తన స్వగృహంలో అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సహచర టీడీపీ ఎంపీలతో పాటు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మంత్రి లోకేష్‌కు శాలువాతో సత్కరించారు.

అల్పాహార విందు అనంతరం మంత్రి నారా లోకేష్ ఎంపీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై చర్చ జరిపిన లోకేష్, కేంద్రరాష్ట్ర సమన్వయంతో ప్రజల సమస్యలకు పరిష్కారాలు సాధించాలని సూచించినట్లు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు.

# జిమ్‌ల ముసుగులో యువతులకు వల

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలని కోరుతూ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు, కేంద్ర క్రీడలు-యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ూూ×)కు నోటీసులు జారీ చేసింది. ఈ ఆరోపణలు నిజమైతే, బాధితుల మానవ హక్కులకు తీవ్ర భంగం వాటిల్లినట్లేనని కమిషన్ అభిప్రాయపడింది.ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో ఓ జిమ్ కేంద్రంగా భారీ దోపిడీ రాకెట్ పనిచేస్తోందని, యువతులే లక్ష్యంగా ఈ దారుణాలు జరుగుతున్నాయని ఓ ఫిర్యాదుదారుడు ఎన్ హెచ్ఆర్సీని ఆశ్రయించారు. మీడియా కథనాల ప్రకారం, ఈ ముఠా వలలో దాదాపు 50 మందికి పైగా యువతులు చిక్కుకున్నారని, ఈ రాకెట్‌లో ఏకంగా ఓ పోలీసు అధికారికి ప్రత్యక్ష ప్రమేయం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. చట్టాన్ని రక్షించాల్సిన పోలీసు అధికారి ప్రమేయం ఉండటం అధికార దుర్వినియోగానికి, శాంతిభద్రతల వైఫల్యానికి, ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడానికి నిదర్శనమని ఫిర్యాదుదారుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మహిళల భద్రతకు, మత స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలిగిస్తుందని తెలిపారు. ఫిట్‌నెస్ కేంద్రాల ముసుగులో వ్యవస్థీకృత నేర ముఠాలు పనిచేస్తున్నాయనడానికి ఈ ఘటనే నిదర్శనమని ఆరోపించారు.ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని, బాధితులకు రక్షణ కల్పించి పునరావాసం కల్పించాలని, నిందితుడైన పోలీసు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారుడు కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దేశవ్యాప్తంగా జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్ల కోసం కఠినమైన నియంత్రణ మార్గదర్శకాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఫిర్యాదును ఎన్ హెచ్ఆర్సీ సభ్యులు ప్రియాంక్ కనూంగో నేతృత్వంలోని బెంచ్ సుమోటోగా స్వీకరించింది. మానవ హక్కుల పరిరక్షణ చట్టం-1993లోని సెక్షన్ 12 ప్రకారం చర్యలు చేపట్టింది. తమ పరిధిలోని జిమ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్ల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించి ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాలు, రిజిస్ట్రేషన్ నిబంధనలు, ప్రమాణాలపై నివేదిక సమర్పించాలని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది. దేశంలో జిమ్‌ల కోసం ఏమైనా జాతీయ విధానాలు ఉన్నాయా అనే వివరాలు ఇవ్వాలని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖను, లైసెన్సింగ్ అవసరాలపై సమాచారం ఇవ్వాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్‌ను కోరింది. ప్రత్యేకంగా మీర్జాపూర్ ఘటనపై లోతైన విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అక్కడి జిల్లా మేజిస్ట్రేట్, ఎస్పీని ఆదేశించింది. సంబంధిత అధికారులు రెండు వారాల్లోగా తమ నివేదికలను సమర్పించాలని స్పష్టం

# ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మేను జయప్రదం చేయండి :సిఐటియు పిలుపు.

**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 4 రిపబ్లిక్ న్యూస్.**





ఓబులవారిపల్లి మండలం మంగంపేటలో సిఐటియు, ఆధ్వర్యంలో, సమ్మె సన్నాహ సమావేశం, సిఐటియు మండల కన్వీనర్, నాగిపోగు పెంచలయ్య, అధ్యక్షతన, బుధవారం సాయంత్రం, సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశానికి, ముఖ్య అతిథులుగా పాల్గొన్న, సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, సిహెచ్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ ,కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం కార్మికుల, ఉద్యోగుల హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తోందన్నారు, స్వాతంత్ర పోరాటం స్ఫూర్తితో సాధించుకున్న కార్మిక చట్టాలన్నింటిని రద్దుచేసి కొత్తగా లేబర్ కోడ్ లను ప్రవేశపెడుతుందని, ఈ లేబర్ కోడ్ లు అమలు జరిగితే కార్మిక వర్గం యూనియన్ పెట్టుకునే హక్కు,కనీస వేతనం, ఉద్యోగ భద్రత,అడిగే స్వేచ్ఛ కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన విధానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని, ఈ విధానాలవలన కార్మిక వర్గం, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, కార్మిక చట్టాలను రద్దుచేస్తే కార్మిక సంక్షేమం, భద్రత అందని ద్రాక్షగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ, చట్టాన్ని రద్దు చేయడం, రైతు వ్యతిరేక, చట్టాల అమలు చేయడం, గిట్టుబాటు ధర లేకపోవడం, నిన్న బడ్జెట్లో, కార్పొరేట్లకు, రాయితీలు ఇవ్వడం, కష్టజీవులకు మొండి చేయి చూపడం, ఇది పెట్టుబడుదారుల ప్రభుత్వం అని విమర్శించారు. ఈ లేబర్ కోడులు వల్ల, కనీస వేతనాలు చట్టం, పీఎఫ్,ఈఎస్ఐ, గ్రాడ్యుటి, లాంటి హక్కులు హరించబడతాయి అన్నారు.సిపిఎం వామపక్ష ప్రభుత్వాలు, ఉన్న కేరళలో, లేబర్ కోడ్లు అమలు చేయమని, అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి హెచ్చరిక పంపాయని. ఇది ఉద్యోగులు కార్మికులు, ప్రభుత్వం కాదని, ఇది అర్చకులప్రభుత్వం అన్నారు. ఈ నేపద్యంలో ఫిబ్రవరి 12 న దేశవ్యాప్త కార్మిక సమ్మె కు జాతీయ కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చిందని ఈ సమ్మె ను కార్మిక వర్గం అంతా ఐక్యం గా పాల్గొ ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం, కోడూరు ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి, ఎస్, శ్రీలక్ష్మి మాట్లాడుతూ, గతఏడు సంవత్సరాలుగా, అంగన్వాడీ వేతనాలు పెంచలేదని, కేంద్రంలో ప్రధాని మోడీ, ఆదివారం బడ్జెట్లో, ఒక్క రూపాయి కూడా అంగన్వాడీలకు, వేతనాలు పెంచలేదని, గతంలో సిఐటియు చలో ఢిల్లీ పిలుపు సందర్భంగా, 1500, రూపాయల పెంచుతున్నారని, రెండుసార్లు చెప్పి, మోసం చేశారన్నారు. కనీస వేతనం, 26000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల కోసం, సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమ్మె కరపత్రాలను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో, అంగన్వాడి ప్రాజెక్టు, అధ్యక్షురాలు ఎన్. రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్, రాధాకుమారి. వాణి, స్వర్ణ, అంజనమ్మ, శంకరమ్మ, స్వాతి, పద్మలత, రేణుక, జ్యోతి, సుబ్బలక్ష్మి, మల్లీశ్వరి, సరస్వతి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కేశవులు,ఆటో యూనియన్ నాయకులు, చెన్నూరు మురళి, అందే.సురేంద్ర, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# ముళ్ళ చెట్లలో ట్రాన్స్ఫార్మర్

**మంత్రాలయం, , ఫిబ్రవరి 4 (రిపబ్లిక్ న్యూస్)** :మంత్రాలయం మండలంలోని వి తిమ్మాపురం గ్రామంలో ట్రాన్స్ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది అని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఈ సందర్భంగా ఆ గ్రామ రైతులు తెలిపిన వివరాల మేరకు ఎలాంటి రక్షణ లేకుండా చుట్టూ ముళ్ళ కంప చెట్లు పెరిగాయి ట్రాన్స్ఫార్మర్ ఆన్ ఆఫ్ చేయడానికి, ఫీజులు పోయిన వేయడానికి కూడా వీల్లేదు అక్కడ ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది ట్రాన్స్కో అధికారులు స్పందించి కంప చెట్లను తొలగించి ప్రమాదాల నుంచి కాపాడాలని రైతులు ప్రజలు కోరుతున్నారు.



## లాడ్జిలలో ఆసాంఘిక కార్యకలాపాలు

**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 4 (రిపబ్లిక్ న్యూస్) :** మంత్రాలయం మండల కేంద్రంలోని ప్రైవేట్ లాడ్జిలలో ఆసాంఘిక కార్యకలాపాలు జరిగినట్లు అందులో ఒక జంటను పట్టుకొని స్టేషన్కు పిలిపించి ఇరువురికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపినట్లు మంత్రాలయం ప్రజలు ఆరోపిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం

**సిఐ రామాంజులు ని వివరణ కోరగా:** మంత్రాలయం లాడ్జిల యజమానులను బాయ్స్ లను పిలిపించి లాడ్జిలలో అసాంఘిక కార్యకలాపాలు జరిగిన అలాంటివారు వచ్చిన మాకు ఇన్ఫర్మేషన్ ఇవ్వాలని వారికి రూమ్ ఇవ్వకూడదని వారికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లే తెలిపారు.

# విజేత మహేంద్ర లెవెన్‌జట్టు




**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి, 4,(రిపబ్లిక్ న్యూస్):**
ఎమ్మిగనూరు పట్టణంలోని వివర్స్ కాలనీ మైదానంలో గత 15 రోజులుగా జరుగుతున్న వైటీపీఎల్ ఎమ్మిగనూరు టౌన్ (ప్రైమరీ లీగ్) బుధవారం ముగిసింది. విజేతగా నిలిచిన మహేంద్ర లెవెన్ జట్టు నిలిచింది. విన్నర్ బహుమతి రూ. 60 వేలతో పాటు కప్ ను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ చేతులు మీదుగా అందజేశారు. రన్నర్ గా నిలిచిన జాలి యంగ్ స్టార్ జట్టుకు రూ. 40 వేలతో పాటు కప్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బందే నవాజ్, రంగస్వామి గౌడ్, సురేష్ చౌదరి, నవీన్ కుమార్, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## బోయకొండ గంగమ్మ ఆలయంలో సాంప్రదాయబద్ధంగా ప్రారంభమైన లక్ష కుంకుమార్చన

**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 04 రిపబ్లిక్ న్యూస్**
శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో 1కుమార్చన సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శక్తి స్వరూపిణి అయినటువంటి బోయకొండ గంగమ్మ ఆలయంలో వేద పండితులు అర్చకుల ఆధ్వర్యంలో విషెస్ అభిషేకము అలంకరణ గావించారు. అనంతరం డాలమెంటరీ హాలులో ఉత్సవ విగ్రహం ముందు 122 మంది దంపతులచే వేద పండితులు లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. తొలి రోజున అమ్మవారి ఆలయంలో విశేష రీతిలో పుష్పాలంకరణ నిర్వహించారు ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం అధికార సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.




## బోయకొండలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు : డి.ఎస్.పి మహేంద్ర

**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 04 రిపబ్లిక్ న్యూస్**
బోయకొండ క్షేత్రంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు భక్తులపై దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నమయ్య జిల్లా మదనపల్లి డిఎస్పి మహేంద్ర హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం బోయకొండ కింద మాంసపు దుకాణాలు నిర్వహించే వారిని అదే విధంగా యాత్రికులను తరలించే సుమోలు ఆటోల డ్రైవర్లను సమావేశం ఏర్పాటు చేసి ఆయన ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు వారి వల్లనే బోయకొండ అభివృద్ధి ఇక్కడ నివసించే వారి జీవితాలు బాగుపడతాయి .కాబట్టి అలాంటి వారి పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ముఖ్యంగా మహిళల పట్ల గౌరవప్రదంగా ఉండాలన్నారు .బోయకొండ కింద పని చేసే వారందరూ ఆధార్ కార్డు ,ఫోటో ,అడ్రస్ ఇచ్చి పోవాలని ఎవరైతే పనిలోకి ఉంటారో వారి పేర్లను క్రమం తప్పకుండా అక్కడ ఉన్నటువంటి పోలీసులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్, ఎస్సై నాగేశ్వరరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ అవగాహన ర్యాలీ

### . నిర్వహించిన ఉదయానంద కార్కినోస్ క్యాన్సర్ ఆస్పత్రి, ఐఎంఏ, నంద్యాల రోటరీ క్లబ్.

### - ప్రారంభించిన ఏ ఎస్ పి జావలి ఆల్ఫోన్స్

**నంద్యాల ఫిబ్రవరి 4 (రిపబ్లిక్ న్యూస్) :**
బుధవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఉదయానంద కార్కినోస్ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో, నంద్యాల ఐఎంఏ, నంద్యాల రోటరీ క్లబ్, మహిళా వైద్య విభాగం, రోటరీ ఇన్నర్ వీల్ నిర్వహణలో ఉదయానంద ఆసుపత్రి నుండి క్యాన్సర్ పై ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఏ ఎస్ పి జావలి ఆల్ఫోన్స్ ముఖ్యఅతిథిగా పాల్గొని క్యాన్సర్ పై అవగాహన కరపత్రాలు ఆవిష్కరించి, ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జావలి ఆల్ఫోన్స్ మాట్లాడుతూ క్యాన్సర్ ను ప్రాథమిక దశలో గుర్తించడానికి, తదుపరి పూర్తిస్థాయి చికిత్స అందించి నయం చేసుకోవడానికి అత్యంత ఆధునిక వైద్య పరికరాలు, విధానాలు, ఔషధాలు అందుబాటులోకి వచ్చాయని, ప్రాథమిక దశలో గుర్తించడానికి అవసరమైన పరీక్షలు చేయించుకోవడానికి ప్రజలు సంకోచం లేకుండా ముందుకు రావలసిన అవసరం ఉందని అన్నారు. ఉదయానంద కార్కినోస్ క్యాన్సర్ ఆసుపత్రిలో రొమ్ము క్యాన్సర్ ప్రాథమిక దశలో గుర్తించడానికి ప్రతి శనివారం నిర్వహించే ఉచిత ఓపి కార్యక్రమాన్ని ఏఎస్పీ జావలి ఆల్ఫోన్స్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయానంద కార్కినోస్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సాయి ప్రణీత్, డాక్టర్ సుస్మిత, డాక్టర్ కుషాల్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, , నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్,మహిళా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి మాట్లాడుతూ శరీరంలోని వివిధ అవయవాలలో క్యాన్సర్ ను ప్రాథమిక దశలో గుర్తించే లక్షణాలపై ప్రజలలో అవగాహన పెంచడం అవసరం అన్నారు. తద్వారా ప్రాథమిక దశలో గుర్తించే పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స విధానాలు అనుసరించి క్యాన్సర్ నుండి కాపాడవచ్చు అని అన్నారు. రోటరీ మాజీ గవర్నర్ కల్లూరి రామలింగారెడ్డి,నంద్యాల రోటరీ క్లబ్ అధ్యక్షులు వివేకానంద రెడ్డి,ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు మల్లీశ్వరిమాట్లాడుతూ అంతర్జాతీయ రోటరీ క్లబ్ తరఫున క్యాన్సర్ పరీక్షలకు ఉపయోగపడే 60 లక్షల రూపాయల విలువ చేసే పరికరాలు ఉదయానంద కార్కినోస్ క్యాన్సర్ ఆసుపత్రి కి అందించామని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉదయానంద ఆసుపత్రి వైద్యులు జీర్ణకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ భార్గవ రెడ్డి, క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ సాయి ప్రణీత్, రేడియేషన్ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ సుష్మిత, మెడికల్ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ కుశాల,ఆసుపత్రి డైరెక్టర్ పరమేశ్వర రెడ్డి, మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, గుండె జబ్బుల నిపుణులు డాక్టర్ రామేశ్వర్ రెడ్డి, స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ గీతావాణి, శస్త్ర చికిత్స నిపుణులు నాగ సుదర్శన్ రెడ్డి, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ, మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, రాష్ట్ర కార్యవర్గ కమిటీ సభ్యులు డాక్టర్ విజయభాస్కర రెడ్డి, డాక్టర్ వసుధ, మహిళా వైద్య విభాగం కార్యదర్శులు డాక్టర్ సునీత, డాక్టర్ శైలజ, సీనియర్ మహిళా వైద్యులు డాక్టర్ నాగమణి, డాక్టర్ నర్మద, రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ కల్లూరి రామలింగారెడ్డి,అధ్యక్షులు వివేకానంద రెడ్డి, సీనియర్ సభ్యులు కైలాసనాథరెడ్డి, ప్రసాదరెడ్డి, లక్ష్మీనారాయణ, చిత్తలూరి రామచంద్రయ్య, ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు మల్లీశ్వరి, ఇన్నర్ విల్ సభ్యులు సువర్చల, వసుంధర, ఉదయానంద ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.




ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం లో క్యాన్సర్ పై ప్రజా అవగాహన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏ ఎస్ పి జావలి ఆల్ఫోన్స్, వైద్యులు, రోటరీ క్లబ్ సభ్యులు

# చిన్న,వీధి వ్యాపారస్తుల సంక్షేమానికి సహకరిస్తాం: ఎన్ఎండి ఫిరోజ్

### నంద్యాల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన ఫిరోజ్ ను సత్కరించిన నంద్యాల జిల్లా చిన్న,వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం

**నంద్యాల ఫిబ్రవరి 4 (రిపబ్లిక్ న్యూస్) :**
నంద్యాల పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా మూడవసారి ఎంపికైన ఎన్ఎండి ఫిరోజ్ ను నంద్యాల జిల్లా చిన్న,వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ చిన్న వీధి వ్యాపారస్తుల సంక్షేమం కోసం సహకరిస్తామని, వారి ప్రయోజనాలు కాపాడుతామని అన్నారు. గుర్తింపు కార్డులు లేనివారికి కొత్త కార్డులు అందజేస్తామన్నారు. మెప్మా ద్వారా వారికోసం కేటాయించిన సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీధి వ్యాపారస్తుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ప్రజలకు,పార్టీ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటామని,ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ముందుంటామని తెలిపారు. డాక్టర్ రవి కృష్ణ చిన్న,వీధి వ్యాపారస్తుల ప్రయోజనాల కోసం చాలా సంవత్సరాలుగా ముందుండి నడిపించడం అభినందనీయం అన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ "కేంద్ర వీధి వ్యాపారస్తుల జీవనోపాధి రక్షణ చట్టం" ప్రకారం వారి ప్రయోజనాలను కాపాడడం అవసరమన్నారు. టౌన్ వెండింగ్ కమిటీ మున్సిపాలిటీ తరఫున ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.మంత్రి ఫరూక్, తెలుగుదేశం పార్టీ యువ నేతలు ఫయాజ్,ఫిరోజ్ వీధి వ్యాపారస్తులకు నిరంతరం అండగా నిలుస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా చిన్న,వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా,ప్రధాన కార్యదర్శి చిన్న మాతంగి ఉమా మహేష్, ఉపాధ్యక్షులు అజీజ్ ఖాన్,మద్దినేని వెంకటరమణ,సంయుక్త కార్యదర్శులు షేక్ ఖాజా హుస్సేన్ బాణాల వెంకటేశ్వర్లు ఆచారి,కార్యవర్గ సభ్యులు శివ ఆచారి, షేక్ పాంశావళి, గంగిశెట్టి, షేక్ అన్వర్ భాష,షేక్ నాజర్ భాష, ఆకుమల్ల శ్రీనివాసులు, ఆకుమల్ల వెంకటరమణ, పెద్ద సంఖ్యలో చిన్న, వీధి వ్యాపారస్తులు పాల్గొన్నారు.



# బడ్జెట్లో ఐసిడిఎస్ కు నిధులు పెంచాలి

### - అంగన్వాడి వేతనాలు పెంచాలి

### --సిఐటియు నాయకులు డిమాండ్

**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి, 4, (రిపబ్లిక్ న్యూస్):**
అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి. ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గోవర్ధనమ్మ అధ్యక్షతన సిడిపిఓ ఎమ్మిగనూరు ప్రాజెక్ట్ ఆఫీస్ ముందు కార్యదర్శి గోవర్ధనమ్మ అధ్యక్షతన బుధవారం ధర్నా నిర్వహించారు. 2026- 27 కేంద్ర బడ్జెట్లో అంగన్వాడీలకు అన్యాయం జరిగిందని యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి బి. గోవర్ధనమ్మ, సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు విమర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసిడిఎస్ లో పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్లు హెల్పర్ల దుస్థితి మరియు వారి హక్కులపై బడ్జెట్లో మాట్లాడకపోవడం అన్యాయమని వారి ఆరోపించారు. మౌలిక సదుపాయాలు, సేవలు అంగన్వాడి వాళ్ళతో అధిక పని వారం చేయిస్తూ, వారి స్థితిగతులను ఆలోచించి బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం దాదాపు వేతనాలు పెంచకుండా సుప్రీంకోర్టు ఆదేశాల అనుసారం కార్మికులకు గ్రాడ్యుటీ సౌకర్యం కల్పించకుండా, వాటికి నిధులు కేటాయించకుండా అన్యాయం చేయడం భావ్యం కాదని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కార్మిక చట్టాల ద్వారా కార్మికులకు కనీస వేతనాలు అందిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్న భారత ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు కేవలం నామమాత్రపు వేతనాలతో సరిపుచ్చడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. 2018 నుండి సామాన్య ప్రజలకు ఆహారం, ఆరోగ్యం, విద్య వంటి సేవలను ప్రజలకు అందిస్తున్న అంగన్వాడీలకు మాత్రం సరిపడా వేతనాలు ఇవ్వడంలేదని ఆరోపించారు. స్కీం వర్కర్లకు ఇప్పటివరకు సామాజిక భద్రత పెన్షన్ లేదు. 2022లో సుప్రీంకోర్టు స్కీం వర్కర్లకు గ్రాడ్యుటీ అమలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చిన వాటి అమలు చేయకపోవడం బాధాకరమని తెలియజేశారు. 2026 -27 సంవత్సరానికి "సంక్షేమ అంగన్వాడీ పోషణ్ పథకం" కింద పోషకాహార నిబంధనల కోసం బడ్జెట్ పెంచుతామని 2017 లో హామీ ఇచ్చిన నేటి వరకు సరిపడా అనంత నిధులు కేటాయించలేదని విమర్శించారు. నేటికీ చాలా అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని తాగునీరు, టాయిలెట్ సౌకర్యాలు సమకూర్చడం లేదని తెలియజేశారు. ఈ బడ్జెట్ సాధారణంగా కార్మికుల గురించి స్కీమ్ వర్కర్ల పని పరిస్థితుల్ని మెరుగుపరిచే విధంగా నిధులు కేటాయించాలని అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని ఫిబ్రవరి 12న జరుగు అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ కు వినతి పత్రం సమర్పించారు. అంగన్వాడి కార్యకర్తలు నీరజ, నాగ శిరోమణి, బేబీ రాణి, లక్ష్మీదేవి, శారద, వరలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.




## సీఎం పర్యటనకు 1200 మంది పోలీసులు

**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి, 4,(రిపబ్లిక్ న్యూస్):**
ఫిబ్రవరి 6న ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో 1200 మంది పోలీసులతో పటిష్టమైన భద్రతా బందోబస్తును ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్, సభ ప్రాంగణం, రూట్, ట్రాఫిక్, పార్కింగ్, బాంబ్ స్క్వాడ్ వంటి కీలక ప్రాంతాల్లో పూర్తి అప్రమత్తత పాటించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేతో పాటు ఇతర అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు రెవిన్యూ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి గిత్తలు రాతి దూలం లాగుడు

# పోటీలను ప్రారంభించిన గుమ్మనూరు ఈశ్వర్

**గుత్తి ఫిబ్రవరి 04 (రిపబ్లిక్ న్యూస్)**
గుత్తి మండలం పరిధిలోని తొండపాడు గ్రామం నందు శ్రీ బొలికొండ రంగనాధ స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్రస్థాయి ఒంగోలు జాతిగిత్తలు రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు గుత్తి మరియు పామిడి ఇన్చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ కు

ముందుగా ఆలయ కమిటీ సభ్యులు శాలువాలు కప్పి పూలమాలతో స్వాగతించారు అనంతరం గుమ్మనూరు ఈశ్వర్ రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ ప్రాచీన పద్ధతులను పాటిస్తూ తొండుపాడు గ్రామం నందు ఈ రాతి దూలం లాగుడు పోటీలను నిర్వహించడం ఎంతో



సంతోషంగా ఉందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు రాతి దూలం పోటీలలో గెలుపొందిన జతలకు మొదటి బహుమతి గా మ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ ఒక లక్షా వెయ్యినూట16లు మొదటి బహుమతిగా అందజేయడం జరుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రతాప్ టిడిపి సీనియర్ నాయకులు చిన్న రెడ్డి రంగస్వామి రెడ్డి మండల అధ్యక్షుడు లక్ష్మి రంగయ్య ఎంపీటీసీ నారాయణస్వామి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ శ్రీనివాసులు శ్రీపురం సర్పంచ్ రామలింగమయ్య యంగన్నపల్లి సర్పంచ్ భరత్ డీలర్ మద్దిలేటి ఊబిచర్ల సర్పంచ్ చితంబర్ కోనంకి కృష్ణ గుత్తి పట్టణ మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# క్యాన్సర్ నియంత్రణకు అవగాహనే ప్రధాన ఆయుధం

**ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నియంత్రణ సాధ్యం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంలో మంత్రి టీజీ భరత్**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 4)**
క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ఎదుర్కోవాలంటే అవగాహననే ప్రధాన ఆయుధమని, ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను పూర్తిగా అదుపులోకి తీసుకురావచ్చని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ తెలిపారు.
ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బచ్చు జానకిరాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పారిశుద్ధ్య కార్మికులకు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు, ముందస్తు పరీక్షల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 9 నుంచి 14 ఏళ్ల పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు క్యాన్సర్ నిరోధక టీకాలు వేశారు. మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్యాన్సర్‌పై భయం కాదు, జాగ్రత్త అవసరమన్నారు. నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని



సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, వ్యాయామం ద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద వైద్య సంస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.
మేయర్ మాట్లాడుతూ నగర స్వచ్ఛతలో కర్నూలును టాప్5లో నిలిపే లక్ష్యాన్ని మంత్రి టీజీ భరత్ నాయకత్వంలో సాధించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండి వైద్యుల సూచనలు పాటిస్తే కొందరు ఒకే ఇంజెక్షన్‌తో రక్షణ పొందే అవకాశముందని తెలిపారు.
కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి బచ్చు జానకిరాం ఫౌండేషన్ రూ.2,500 విలువైన హెచ్‌పీవీ క్యాన్సర్ నిరోధక టీకాలను కార్మికుల పిల్లలకు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. కార్మికుల ఆరోగ్యం, సంక్షేమానికి నగరపాలక సంస్థ అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.
బచ్చు జానకిరాం ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బి.రవీంద్ర బాబు, బి.సాయివాణి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సే లక్ష్యంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఒక్కొక్కటి రూ.2,500 విలువైన హెచ్‌పీవీ టీకాను ఇప్పుడు ఒక మోతాదు, ఆరు నెలల తర్వాత మరో మోతాదు వేస్తామని వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# మార్చి నాటికి బయో మైనింగ్ పూర్తి చేయాలి

**-ఏప్రిల్‌లో వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులకు శ్రీకారం**
**-స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 4)**
కర్నూలు శివారులోని గార్గేయపురం డంప్‌యార్డులో కొనసాగుతున్న బయో మైనింగ్ ప్రక్రియను మార్చి చివరి నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సంబంధిత గుత్తేదారులను ఆదేశించారు. ఏప్రిల్ నెలలో వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం (డబ్ల్యూఈపీ) నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్‌తో కలిసి గార్గేయపురం డంప్‌యార్డులో ప్రతిపాదిత వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు కేటాయించిన ప్రదేశంలో జరుగుతున్న బయో మైనింగ్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో మున్సిపల్, ప్రజారోగ్య, జెడ్పీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా గార్గేయపురం డంప్‌యార్డులో మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్‌ఎఫ్) నిర్మాణానికి సంబంధించిన ఒప్పంద ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే జోహరపురం డంప్‌యార్డులో జరుగుతున్న బయో మైనింగ్ పనులను కూడా వేగవంతం



చేయాలని సూచించారు.నగరంలోని ప్రైవేట్ సెప్టిక్ ట్యాంకుల వివరాలను తప్పనిసరిగా మున్సిపల్ కార్యాలయంలో నమోదు చేయాలని, వాటి తరలింపు వాహనాలకు జీపీఎస్ పరికరాలు అమర్చాలని స్పష్టం చేశారు. సెప్టిక్ ట్యాంకుల నుంచి సేకరించే మలిన అవశేషాలను కేవలం మురుగు శుద్ధి కేంద్రం ద్వారానే శుద్ధి చేయాలని అధికారులకు సూచించారు. 'నమస్తే' కార్యక్రమం ద్వారా చెత్త సేకరణలో నిమగ్నమైన వ్యర్థ సేకరించేవారిని గుర్తించి, వారికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఐఈసీ కార్యక్రమాలు, నిర్మాణకూల్చివేత వ్యర్థాల నిర్వహణ విధానాల అమలుపై కూడా ఆయన ఆరా తీశారు.సమీక్షలో పట్టాభిరామ్ మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు జిల్లా, అనంతపురం జిల్లాల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను శాస్త్రీయంగా వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ప్రజాప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో సుమారు రూ.300 కోట్ల వ్యయంతో రెండేళ్లలో వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా చెత్త నిల్వలు తగ్గడంతో పాటు పర్యావరణ కాలుష్యం నియంత్రణ, స్వచ్ఛమైన శక్తి ఉత్పత్తి, స్థానిక ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.
ప్రతిరోజూ సుమారు 100 టన్నుల చెత్త నుంచి ప్లాస్టిక్, కాగితం, లోహం, గాజు వంటి పునర్వినియోగ పదార్థాలను వేరు చేసి మళ్లీ వినియోగానికి పంపే ఎంఆర్‌ఎఫ్ కేంద్రాన్ని ఆరు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. దీని వల్ల చెత్త పరిమాణం గణనీయంగా తగ్గి నగర పరిశుభ్రత మెరుగుపడుతుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నార్సపు రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య ఈఈ గుర్రప్ప యాదవ్, కార్యదర్శి నాగరాజు, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ నాగిరెడ్డి జయంతి వేడుకలు విజయవంతం చేయండి

**అఖిలభారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల**



**గుత్తి ఫిబ్రవరి 04 (రిపబ్లిక్ న్యూస్)**గుత్తి పట్టణంలో ఆకిలభారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో కామ్రేడ్ తరిమెల జయంతి సందర్భంగా కరపత్రాలు విడుదల చేయడం జరిగింది ఈనెల ఫిబ్రవరి 11వ తారీఖున కూడేరు మండలంలో కామ్రేడ్ నాగిరెడ్డి జయంతి జరుపుచున్నాను జిల్లా అన్ని మండలాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయవలసిందిగా అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ పిలుపునివ్వడం జరిగింది పిలుపుమేరకు ఈరోజు గుత్తిలో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది నాగిరెడ్డి తరిమెల గ్రామంలో ఉన్నత స్థాయి కుటుంబంలో పుట్టి పీడిత ప్రజల విముక్తి కోసం పోరాటం చేయాలని నిర్ణయం చేసుకొని బలమైన ఉద్యమాలు చేయడం జరిగింది భూమికోసం పోరాటం చేసి పేద ప్రజలకు భూములు పంచడం జరిగింది కామ్రేడ్ నాగిరెడ్డి జయంతి సందర్భంగా ఆయన ఆశయ సాధన కోసం ముందుకు నడవాలని పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో గుంతకల్ డివిజన్ కమిటీ సభ్యుడు రామాంజనేయులు మరియు గుత్తి డివిజన్ కమిటీ సభ్యుడు ధనుంజయ కమిటీ సభ్యులు మహమ్మద్ భాష దస్తగిరమ్మ అమీనా భాను రాజమ్మ రేణుక శిరీష తదితరులు పాల్గొన్నారు

# నకిలీ ఎస్ఐ పేరుతో సైబర్ బెదిరింపులు

**15 లక్షల రూపాయలు మోసం... ఇద్దరు నిందితుల అరెస్ట్**

**ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్**

**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 4, (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పోలీసు అధికారి ప్రమోద్ పర్యవేక్షణలో కోవెలకుంట్ల పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంత్ నాయక్ కోయిలకుంట్ల పోలీసు స్టేషన్ సైబర్ క్రైమ్ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేయడం జరిగింది. 28.01.2026న నిందితుడు అక్కపల్లి చంద్రశేఖర్ తాను తెలంగాణా రాష్ట్రం గద్వాల్ ఎస్ఐ అని ఫిర్యాది కోవెలకుంట్లకి చెందిన కర్నాటి ప్రతాప్




రెడ్డికి ఫోన్ చేసి మీరు గద్వాల్ లో కండక్టర్ భార్యకు మెసేజ్ చేయడం వలన అది చూసిన కండక్టర్ ఆమెను కొట్టడంతో గడ్డిమందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసి ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుంది రోజుకు రెండు లక్షలు చొప్పున రెండు రోజులకు కట్టాలి. మీరు కడితే సరే లేదంటే పోలీసు కేసు అవుతుందని బెదిరించినారు. కాబట్టి కండక్టర్ తో మాట్లాడుకోమని చెప్పగా రెండవ నిందితుడు దాసరి సందీప్ కుమార్ కండక్టర్ లాగా మాట్లాడి 4 లక్షలు రూపాయలకు గానూ ఫోన్ పేలో 30,000/- రూపాయలు డబ్బులు వేయించుకున్నాడు. అందుకు కోవెలకుంట్ల పోలీసు స్టేషన్ లో సైబర్ క్రైమ్ కేసు నమోదు అయినది. ఇప్పటిదాకా విచారణలో సుమారు 15 లక్షల రూపాయలు ఆంధ్ర రాష్ట్రంలో, తెలంగాణాలో ఒక్కొక్కరి నుండి 50,000/- లు, లక్ష, 2 లక్షలు, 3 లక్షలు బెదిరించి వీరి ఫోన్ పే, బ్యాంకు అకౌంట్లలో వేయించుకున్నట్లు తెలిసింది. బాధితులు థ్రెడ్ల యాప్ లో మహిళల ఫోటోలలో కామెంట్లల యందు చాటింగ్ చేయడం, వీరి ఫోన్ నెంబర్లు పెట్టడంతో ఈ ఇద్దరు నిందితులు వాటిని గమనించి బాధితులకు ఫోన్ చేసి బ్లాక్ మెయిల్ చేసి ఎస్ఐ కాకపోయినా ఎస్ఐ అని బెదిరించి డబ్బులు వీరి అకౌంట్లో వేయించుకొని మోసం చేసినారు. ఇప్పటివరకు సుమారు 2 నెలల కాలంలో 15 లక్షల రూపాయలు వీరు అకౌంట్లలో వేయించుకున్నారు. ఇంకా కొంత మంది పేర్లు తెలియవు అని అంటున్నారు. ఎవరైనా వీరి వలన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కావచ్చు, పక్క రాష్ట్రాలలో మోసపోయి ఉంటే ఇప్పటికైనా సంబంధిత పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయమని తెలియజేస్తున్నాము. ఏదైనా సైబర్ నేరం లేదా ఆన్‌లైన్ ఆర్థిక మోసం జరిగితే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు కాల్ చేయాలి. అలా చేస్తే తక్షణం సంబందిత పోలీస్ లు మీకు అందుబాటులో వస్తారు. 1930 కు తక్షణమే ఫిర్యాదు చేస్తే మోసపోయిన డబ్బును వెంటనే నేరస్థుల బ్యాంకు ఖాతా ఫ్రీజ్ చేయడం జరుగుతుంది మరియు సంబంధిత క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితులను త్వరగా గుర్తించి అరెస్టు చేయడం సాధ్యమవుతుంది.

# ప్రజల మాటను లెక్కచేయకుండా వ్యవహరిస్తున్న గ్రామ సర్పంచ్ మరియు కార్యదర్శి






**హత్నూర :04 ఫిబ్రవరి26 ( రిపబ్లిక్ న్యూస్)** ప్రజల చేత ప్రజల కొరకు ప్రజలు ఎన్నుకోబడ్డ ప్రజాస్వామ్యంలో ప్రజలనే లెక్కచేయకుండా వ్యవహరిస్తున్న గ్రామ సర్పంచ్ సుజాత వివరాల్లోకి వెళితే కొన్యాల గ్రామంలో ప్రైమరీ మరియు హై స్కూల్ కి ఎదురుగా 10 మీటర్ల దూరంలో ఉన్న గుడాల మానయ్య తండ్రి అంజయ్య గారి శ్రీ బాలాజీ కిరాణం జనరల్ స్టోర్ ఉండటం వలన స్కూల్ పిల్లలకి ఇబ్బందులు ఎదురవుతున్నావి చాయ్ సమోసా గుట్కా సిగరెట్ వివిధ అనారోగ్య హానికరమైన వస్తువులు అమ్మడంతో పిల్లలు తినుబండాల కొరకు వెళ్లి వస్తుండగా మోటర్ వెహికల్ భారీ పెద్ద వాహనాలు వస్తుంటాయి కనుక పిల్లలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది కనుక ఇట్టి బాలాజీ కిరాణం


తేదీ: 04-02-2026
శ్రీ యుత గౌరవ నీయులైన గ్రామ పంచాయితీ కార్యదర్శి మరియు గ్రామ సర్పంచ్ గారికి వినపం
అయ్యా-
తమరితో మనవి చేయునది ఏమనగా మేము అనగా కొన్యాల గ్రామ ప్రైమరీ స్కూల్ హై స్కూల్ లలో చదువుతున్న తల్లి తండ్రిలా వినపం ఏమనగా గ్రామంలోని ప్రైమరీ స్కూల్ ముందు ఉన్న గుడాల మణయ్య తండ్రి అంజయ్య గ్రామము కొన్యాల్ గారు శ్రీ బాలాజీ కిరణం జనరల్ స్టోర్ ఉండడం వలన చిన్నపిల్లలకు ఇబ్బందులు ఎదురవుతున్న ఆకిరణం స్టోర్ చాయ్ సమోసా గుట్కా సిగరెట్ వివిధ ఆరోగ్య హానికరమైన వస్తువులు అమ్మడంతో అక్కడి స్కూల్ పిల్లలకు తిను బండల కొనుగోలు చెయ్య వెళ్లి వస్తుండగా మోటర్ వెహికల్ ఆటోలు బారి పెద్ద వాహనాలు వస్తుంటాయి కనుక పిల్లలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది కనుక ఇట్టి బాలాజీ స్టోర్ వెంటనే తొలగించాలని మీతో మనవి.
ఇట్లు,
తల్లి తండ్రుల సంతకాలు,

స్టోర్ వెంటనే తొలగించాలని గ్రామ ప్రజలు సర్పంచ్ మరియు కార్యదర్శి గారికి వినతి పత్రం అందజేశారు ఇప్పటివరకు ఉన్నవి తీసివేయము ఇప్పుడు కొత్తగా పరిమిషన్లు ఇవ్వబడవు అని సర్పంచ్ గారు మాట్లాడారు ఇది మాహిష్మతి మాట నా మాటే శాసనం అంటూ సినిమా డైలాగ్స్ కొట్టుకుంటూ వెళ్లిపోయారు అక్కడున్న కారోబార్ గారిని కిరణ షాపుకు పర్మిషన్ ఉందా అని అడుగుతే అసలా కిరణ షాపుకు పరిమిషనే లేదని ఇప్పటివరకు ఆ కిరణ షాపుకు సంబంధించి రికార్డులో ఎలాంటివి నమోదు కాలేవని వివరించారు ఇలాంటి పర్మిషన్ లేని కిరణ షాపులకు స్కూల్ పిల్లలకు ఇబ్బంది కలిగేలాగా ప్రవర్తించడం సర్పంచ్ గారికి ఎంతవరకు సమంజసమో ఆలోచించాలని కోరుతున్నాము రేపు ఎంఈఓ డిపిఓ సార్ గారిని కలిసి దీని కొరకు వివరిస్తామని కూడా తెలియజేస్తున్నాము. వెంటనే ఈ కిరణ షాప్ ను తొలగించకపోతే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని, హెచ్చరిస్తున్నాము.

ప్రజా రిపబ్లిక్
గురువారం 5 ఫిబ్రవరి 2026

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ -రూ.63 లక్షల చెక్కులు అందజేత



**అనంతపురం సంక్షేమం, జనవరి 04,(రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసేదే చెబుతారు.. చెప్పిందే చేస్తారని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మొత్తం 50 మందికి 63 లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కష్ట సమయంలో ఆదుకున్నారని లబ్ధిదారులు ఎమ్మెల్యే దగ్గుపాటికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనివిధంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలను ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 452 మందికి రూ.4.86 కోట్లు అందించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఇందులో మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేకంగా చొరవ చూపుతున్నారన్నారు. మరోవైపు ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తున్నారన్నారు. పింఛన్ల పెంపు, అన్నక్యాంటీన్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను చెప్పిన మాట ప్రకారం అమలు చేస్తున్నామన్నారు. ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూసే విధంగా నేడు పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో గూగుల్ వంటి సంస్థలు కూడా ఏపీకి వచ్చాయన్నారు. ఓవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. హంద్రీనీవా కాలువను కేవలం 100 రోజుల్లోనే వెడల్పు చేసి 40 టీఎంసీల మేర నీరు తీసుకువచ్చారన్నారు. రానున్న రోజుల్లో మరికొంత నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాను హార్టికల్చర్ హబ్ గా మార్చడంతో పాటు కొన్ని పరిశ్రమలు కూడా తీసుకొస్తున్నారని చెప్పారు. ఇది పేదల పక్షాన నిలబడుతున్న ప్రభుత్వం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## విద్యార్థి నాయకులను కిడ్నాప్ చేసిన మోహన్ బాబును తక్షణమే అరెస్టు చేయాలి




**తణుకు ప్రతినిధి, ఫిబ్రవరి 4, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)** బుధవారం రోజు పి ఎస్ యు విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మల ప్రేమ్ కుమార్ అశోక్ కుమార్సినీ నటుడు మోహన్ బాబు గుండాలచే విద్యార్థి నాయకులపై దౌర్జన్యం చేసి కిడ్నాప్ చేయడం దుర్మార్గ చర్య అని పి ఎస్ యు విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మల ప్రేమ్ కుమార్ అశోక్ కుమార్ పేర్కొన్నారు.తణుకు పట్టణంలోని విద్యాశాఖ కార్యాలయం ఆవరణంలోని నుంచి పత్రిక ప్రకటన ద్వారా కోరారు అనంతరం నిమ్మల ప్రేమ్ కుమార్, బుధవారం రోజుఅశోక్ మాట్లాడుతూ సినీ నటుడు మోహన్ బాబు నిర్వహిస్తున్న యూనివర్? దానికి జరుగుతున్న అక్రమాలపై కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడానికి వెళుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్, ఎస్ఎఫ్ఐ ఎస్వీ యూనివర్సిటీ నాయకుడు వినోదులపై కలెక్టర్ కార్యాలయం వద్ద సినీ నటుడు మోహన్ బాబు అనుచరులుగా ఉన్న 30 మంది వాహనాలలో వచ్చి అమానుషంగా వీరిపై దాడికి పాల్పడడమే కాకుండా తమ వెంట తెచ్చుకున్న వాహనాలలో వీరిని కిడ్నాప్ చేసితీసుకెళ్లారన్నారు.మోహన్ బాబు యూనివర్సిటీలో గతంలో అనేక అక్రమాలు జరిగాయని, వాటిని వెలుగులోకి తీసుకొస్తున్న విద్యార్థి నేతలపై దాడులకు పాల్పడడం ఆయన పద్ధతి కాదని వారు తెలిపారు

# గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

### గిరిజన గురుకుల పాఠశాలను వెంటనే పూర్తి చేయాలి

### ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప




**కళ్యాణదుర్గం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 04,(రిపబ్లిక్ న్యూస్):** గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని, ఇందులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప పేర్కొన్నారు. బుధవారం కళ్యాణదుర్గం రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో డివిజనల్ స్థాయి అధికారులతో ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్, మున్సిపాలిటీ పరిధిలో కాంప్లెక్స్ లలో ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్టీసీ కాంప్లెక్స్ లో కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, సెరికల్చర్, ఆర్.అండ్.బి, పంచాయతీ శాఖలు, ఇతరత్రా అధికారులు గ్రామీణ గిరిజన ప్రాంతాలలో త్రాగునీరు, రోడ్లు, విద్య, వైద్యం సదుపాయాలను కల్పించాలని కోరుతూ సంబంధిత అధికారులకు ఆదేశాలను ఇవ్వడం జరిగింది. ఐసిడిఎస్ లో అంగన్వాడీ పోస్టులలో ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని, గిరిజనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి బాధితులకు సకాలంలో న్యాయం చేయాలని, సకాలంలో పరిహారం మంజూరు చేయాలని, గిరిజనులకు అటవీ హక్కు చట్టం ద్వారా పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వసంత బాబు, డిఎల్డిఓ నాగేశ్వరరావు, డిఎస్పి రవిబాబు, సంబంధిత అధికారులు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మోహన్, ఎస్టి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే వీరాంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ చౌదరి, బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

**త్రాగునీరు సమస్యలు పరిష్కరించాలి :**అంతకుముందు కళ్యాణదుర్గం మండలం ముద్దినాయ పల్లి గ్రామంలో గిరిజనులతో ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యులు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు, ఆర్డీవో, డిఎస్పి, తహసిల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ సభ్యులు మాట్లాడుతూ ముద్దినాయనపల్లి గ్రామంలో ఉన్నటువంటి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను త్వరితగతిన పూర్తి చేసి పాఠశాలను ప్రారంభించాలని అధికారులను కోరారు. అదేవిధంగా గిరిజన ప్రజలతో మాట్లాడి స్థానికంగా ఉన్నటువంటి వారి సమస్యలను తెలుసుకొని ఆ సమస్యలను అధికారులు గిరిజన గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు ఎక్కడికక్కడ పరిష్కరించే విధంగా ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. వేసవికాలం ప్రారంభమవుతున్న సందర్భంగా గిరిజన తండాలలో త్రాగునీరు సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. గిరిజన గ్రామాల్లో రోడ్డు రవాణా పాఠశాల వైద్యశాలలు, త్రాగునీరు, సాగునీరు లేనటువంటి గ్రామాలను గుర్తించి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఆగిపోయిన భవనాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తామని తెలియజేశారు. అక్కడ ఉన్న గిరిజనులతో సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడ అధికారులను ఆదేశిస్తూ స్థానిక శాసనసభ్యులు సహకారంతో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు అయిందని, ఆ తర్వాత దారిద్ర రేఖకు దిగువ ఉన్న తండాలకు రోడ్లు మంజూరు చేశారని, గిరిజనుల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వంతోనే సాధ్యమని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యులు తెలిపారు. అనంతరం ఎస్టీ కమిషన్ సభ్యులని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్, నాయకులు పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు







**చిప్పగిరి, ఫిబ్రవరి, 4,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండలం ఏబీసీ కెనాల్ పిల్ల కాలువ నెంబర్ నాలుగు నందు ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి బుధవారం పరిశీలించి చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు, సమావేశంలో మాట్లాడుతూ ఆలూరు బ్రాంచ్ కెనాల్ నందు 14250 ఎకరాల ఆయకట్టు అందిస్తున్నామని గత ప్రభుత్వం లో ఐదు వేల ఎకరాలకు మాత్రమే ఇచ్చిన పరిస్థితి లేదు అని, డిస్ట్రిబ్యూటర్ కెనాల్ నందు 19 పిల్ల కాలువలు ఉంటే ప్రతి కాలువకు నీళ్లు అందిస్తున్నామని, గత ప్రభుత్వం 9 కాలువలకు నీళ్లు రావడం కష్టమైందని, మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నిమ్మల రామానాయుడు రైతులకు ఇబ్బంది కలగ రాదని ఎక్కువ ఫండ్ రిలీజ్ చేయడం జరిగిందని, 19 నెలల కాలంలో 8000 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని, అందుకే ఈ ప్రభుత్వాన్ని రైతులు ప్రభుత్వము అని పిలుస్తారని తెలిపారు, ఈ కార్యక్రమంలో సాగునీటి అధ్యక్షుడు నగరడోన కిష్టప్ప, మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, మండల కన్వీనర్ కొండ పురుషోత్తం, చిప్పగిరి సర్పంచ్ దాసరి గోవిందరాజులు, దేగులహాల్ సర్పంచ్ నీలకంఠ, రామదుర్గం తిమ్మయ్య, సోము నాయుడు, రామచంద్ర, మాధవులు, బెల్డోన కరివేముల గోవిందు, ఏరూరు దానప్ప, నరసింహులు, జనార్ధన స్వామి, బోగేస్ స్వామి, నంచర్ల తిమ్మప్ప, గుమ్మనూరు అంపయ్య, కోట్ల వెంకటేష్ ,బోయ నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

# చిప్పగిరి లో సంపూర్ణ అభియాన్ 2.0












**చిప్పగిరి, ఫిబ్రవరి, 4,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండలం స్థానిక ఎంపీడీవో ఆఫీస్ నందు బుధవారం ఎంపీడీవో అల్లా బకాస్ ఆధ్వర్యంలో సంపూర్ణ అభియాన్ 2.0 కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ జూటూరు హేమలత, ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ఎమ్మార్వో ఇజాజ్ అహ్మద్ పాల్గొన్నారు, ఎంపీడీవో అల్లా ప్రకాష్ మాట్లాడుతూ సంపూర్ణ అభియాన్ 2.0 పథకం కార్యచరణ ప్రాణాలిక చేపట్టాలని, విద్య, వైద్య, పిల్లలకు, గర్భిణీలకు పోషకాహారం, చిన్న పిల్లల ఆరోగ్యం ,పాఠశాలలో బాలికలపై ప్రత్యేక శ్రద్ధ, వ్యవసాయ దారిత భూసార పరీక్షలు, పశువులకు టీకాలు, కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు స్వయం సహాయక సంఘాల మహిళలు భాగ్యస్వాములుగా ఉంటారని తెలిపారు, ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు, సాగునీటి అధ్యక్షుడు నగరడోన కిష్టప్ప, మండల కన్వీనర్ పురుషోత్తం, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, చిప్పగిరి సర్పంచ్ దాసరి గోవిందరాజులు, రామదుర్గం తిమ్మయ్య, ఏరూరు మహేష్, ఏవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు, సచివాలయ డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఏపీవో జుబేర్ అహ్మద్, ఏపిఎం శివయ్య, ఎంఈఓ సావిత్రమ్మ , అస్పిరేషనల్ బ్లాక్ నరసింహులు,మండల పంచాయతీ సెక్రటరీలు ,అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పాములపాడు మండలంలోని బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గిత్త.జయసూర్య.





**పాములపాడు ఫిబ్రవరి 4 రిపబ్లిక్ న్యూస్:-** నందికొట్కూరు నియోజకవర్గం,పాములపాడు మండల పరిధిలోని, వివిధ గ్రామాలకు చెందినఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా 14 మంది లబ్ధిదారులకు 72,3053/- లక్షల రూపాయల చెక్కులను శాసనసభ్యులు గిత్త.జయసూర్య పంపిణీ చేయడం జరిగింది. లబ్ధిదారుల వివరాలు తుమ్మలూరు గ్రామానికి చెందిన షేక్.హుస్సేన్ మియా కి 55,000/- రూపాయలు మరియు మొల్ల అత్తర్ రహిమాన్ కి 20,000/- రూపాయలు, కృష్ణరావు పేట గ్రామానికి చెందిన కృష్ణ కుమారి కి 38612/- రూపాయలు, మిట్టకందాల గ్రామానికి చెందిన భువన వంశీకృష్ణ కి 11,2934/- రూపాయలు, మద్దూరు గ్రామానికి చెందిన పటాన్ శాహనాబి కి 25,574/- రూపాయలు, వేంపెంట గ్రామానికి చెందిన అంచె రామకృష్ణ కి 20,000/- రూపాయలు, మరియు మొగిలి వెంకటాద్రి కి 64,000/- రూపాయలు, ఎర్రగూడూరు గ్రామానికి చెందిన దేవావత్ చత్రునాయక్ కి 25,000/- రూపాయలు, పాములపాడు గ్రామానికి చెందిన మండాది కృష్ణవేణి కి 70,000/- రూపాయలు మరియు షేక్.అబ్దుల్లా రహిమాన్ కి 15,1954/- రూపాయలు, జూటూరు బుషాపోగు కృపారావు కి 50,000/- రూపాయలు, చెలిమిళ్ళ గ్రామానికి చెందిన కలబండి రాజమ్మ కి 42,795/- రూపాయలు మరియు వేల్పుల లక్ష్మీదేవి కి 23,084/- రూపాయలు, ఇస్కాల గ్రామానికి చెందిన డి.తరుణ్ కుమార్ కి 24,100/- రూపాయలు మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త.జయసూర్య అందరూ నాయకులతో కలిసి పంపిణీ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఎస్సై-పి.తిరుపాలు, ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్, వేంపెంట గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ, మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, మిట్టకందాల గ్రామ మాజీ సర్పంచ్ & మండల నాయకుడు జి.హరి ప్రసాద్ యాదవ్, పాములపాడు సింగిల్ విండో చైర్మన్ సి.గోవిందు, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్.కరీం భాషా, వేపెంట సింగిల్ విండో చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, పాములపాడు మండలం కూటమి నాయకులు కార్యకర్తలు బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్, బొమ్మ రాజేష్, సుబ్బారావు, రిటైర్డ్ గవర్నమెంట్ టీచర్ వై.దానమయ్య, టీడీపీ నాయకుడు మద్దూరు తిమ్మారెడ్డి, హరినాథ్ రెడ్డి, జూటూరు నాయకులు నాయిని మధు, నాయిని ఉపేంద్ర, నాయిని కృష్ణ, బండ్లమూరి వెంకటేశ్వరరావు, మాండ్రా సేవదల్ భావన రాము, మండల టీడీపీ కల్చరల్ అధ్యక్షులు భావన వినోద్ కుమార్, బూత్ 206 ఇంచార్జ్ నాగ శ్రీనివాసులు,







మిట్టకందాల టీడీపీ యువ నాయకులు సంజన్న, నియాజ్ బాషా లు, తుమ్మలూరు గ్రామ సర్పంచ్ వి.వరప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్లో దళితులకు ప్రత్యేక ప్యాకేజీ

## కేటాయించకపోవడంతో మరోసారి బిజెపి పార్టీ దళితుల వ్యతిరేక పార్టీ అని రుజువైంది.

**అందోల్ ప్రతినిధి ఫిబ్రవరి 4( రిపబ్లిక్ న్యూస్)**

ఇ సందర్భంగా సంగారెడ్డి జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మనిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య మాట్లాడుతు2026 & 27 ఫిబ్రవరి 1 నాడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో దళితులకు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించకపోవడాన్ని దళిత సంఘాలుగా మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచి సంక్షేమ పథకాలు అమలు చేయాలని దళిత సంఘాలుగా పార్లమెంట్ సమావేశాల సందర్భంగా వినతి పత్రాలు ఇచ్చినప్పటికిని కేంద్ర ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా దళితులను ఈ బడ్జెట్లో చిన్న చూపు చూస్తుందని వారు అన్నారు. భూమి లేని నిరుపేదలకు భూమిని ఇచ్చి వారి భూమి సాగు కోసం కావలసిన బోర్లు కరెంటు సౌకర్యాలు కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం



ప్రత్యేక ప్యాకేజీ కేటాయించి వారికి ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేశారు . కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో దళితులకు వయోపరిమితో పాటు మెరిట్ సౌకర్యాన్ని కూడా తగ్గించి వారికి అర్హులుగా ప్రకటించాలని కోరుకుంటున్నాం. అలాగే విదేశీ విద్య కోసం ప్యాకేజీని పెంచి దళితుల్లో ఉన్న వికలాంగులకు దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వ రిజర్వేషన్లు పెంచాలని వారు డిమాండ్ చేశారు. దళిత సంఘాల నాయకులు పొట్టిపల్లి మొగులయ్య. మాట్లాడుతు దళితులలో ఉన్న ఒంటరి మహిళలకు కేంద్ర ప్రభుత్వం ప్రతినెల 10 వేల రూపాయలు పెన్షన్ రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద దళితులకు ఉచితంగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో పలు రాష్ట్రాల్లో దళితుల మీద జరుగుతున్న జాడులను అరికట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇ కార్యక్రమం లో నక్క సూర్య కుమార్. అరిటిక్యాల శంకరయ్య. పొట్టిగాళ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు

# 5వ వార్డులో జోరుగా ఇంటింటి ప్రచారం.

### - కొత్తగొల్ల మాధవి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి





**అందోల్ ఫిబ్రవరి 4( రిపబ్లిక్ న్యూస్)**

అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 5వ వార్డు లో ఇంటింటి ప్రచారం జోరుగా సాగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారెంటీల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. ప్రతి ఇంటికి సంక్షేమా పథకం చేరే దిశగా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తో నే సాధ్యమని ఆయన అన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆశీస్సులు తీసుకొని5వ వార్డ్ అభివృద్ధి కోసం ముందుకు తీసుకువెళ్తానని కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి కొత్త గొల్ల మాధవి శ్రీనివాస్ అన్నారు.

# మహిళపై కత్తితో దాడి హత్యాయత్నం కేసు నమోదు



**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 04 రిపబ్లిక్ న్యూస్**

వరుసకు చిన్నాన్న తనయుడు అయినటువంటి తమ్ముడు అక్కను కత్తితో విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచిన సంఘటన చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు చౌడేపల్లి మండలం దిగువపల్లి పంచాయతీ యానాదిపాలెం కు చెందిన గంగులమ్మ 45 పై అదే గ్రామానికి చెందిన వరుసకు చిన్నాన్న తనయుడు నాగరాజా ఆస్తి విషయమై మంగళవారం రాత్రి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన గంగుల మను 108 సేవల ద్వారా మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చావు బతుకుల మధ్య చికిత్స పొందుతుంది. ఈ మేరకు గంగులమ్మ తండ్రి బీరప్ప ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేశ్వరరావు వివరించారు.

# జోరు అందుకున్న ఎన్నికల ప్రచారం

### కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి చిట్టిబాబు.



**అందోల్ ఫిబ్రవరి 4 ( రిపబ్లిక్ న్యూస్)**



అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 15వ వార్డ్ కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి ఆకుల సత్యనారాయణ చిట్టిబాబు గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ మనది చేతి గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు తెలియజేశాడు. అభివృద్ధి అంటే మంత్రి దామోదర్ రాజనర్సింహ చేపట్టినటువంటి ఎన్నో మన ఆందోళన్ నియోజకవర్గంలో కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నాయి. మన వార్డ్ అభివృద్ధి కావాలంటే చేతి గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో చోటు ఖాన్, ఆత్మ కమిటీ డైరెక్టర్ ఖలేద్, అడ్డు, సోయల్, అబ్బాస్, నజీర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 6వ వార్డులో జోరుగా ఇంటింటి ప్రచారం.

### - జ్యోతి ప్రదీప్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి




**అందోల్ ఫిబ్రవరి 4( రిపబ్లిక్ న్యూస్)**




అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 6వ వార్డు లో ఇంటింటి ప్రచారం జోరుగా సాగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారెంటీల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. ప్రతి ఇంటికి సంక్షేమాన్ని పథకం చేరే దిశగా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం లోనే సాధ్యమని ఆయన అన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆశీస్సులు తీసుకొని6వ వార్డ్ అభివృద్ధి కోసం ముందుకు తీసుకువెళ్తానని కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి జ్యోతి ప్రదీప్ గౌడ్ అన్నారు.

## కర్నూలుటు విజయవాడ ఇంటర్సిటీ కర్నూలు టు విశాఖపట్నం

# కర్నూలు టు ముంబై సూరత్ కు రైలు నడపాలి

### భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)డిమాండ్

**కల్లూరు ప్రతినిధి, ఫిబ్రవరి 4, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం రోజు గుత్తి పెట్రోల్ బంక్ దగ్గర కర్నూలు టు డోన్ పోయే బస్ స్టాప్ లో సంతకాల సేకరణ జరిగింది ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నగర సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్ దంభోళం శ్రీనివాసరావు ఈ కార్యక్రమానికి

ముఖ్య అతిథులుగా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు కర్నూలు నుండి హైదరాబాద్ కు ఇంటర్సిటీ రైలు నడపాలని ఆరోజులో కమ్యూనిస్టు పార్టీలు ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేసిన సందర్భంగా రైల్వే అధికారులు కేసులు నమోదు చేయడం జరిగినది, దాంట్లో భాగంగా కర్నూల్ టు హైదరాబాద్ హైదరాబాద్ టు కర్నూల్ ఇంటర్సిటీ రైలు ప్రతిరోజు నడుస్తూఉన్నది కొద్ది రోజులకే రాష్ట్రం విడిపోవడంతో విజయవాడ రాజధాని కేంద్రంగా మారడంతో కర్నూలు నగర ప్రజలకు మరీ యధావిధిగా కష్టాలు మొదలైనవి విజయవాడకు వెళ్లాలంటే బస్సు మార్గాన వెళితే 700 నుంచి 1000 దాకా బస్ చార్జీ ఉన్నది లేదు ట్రైన్ కి వెళ్ళాలి అనుకుంటే డోన్ లేదా నంద్యాలకు వెళ్లాలి గత పది సంవత్సరాలుగా కర్నూల్ నగర ప్రజలు ఇబ్బందులు



పడుతున్నప్పటికీ పార్టీ ప్రజాసంఘాలు ఆందోళన చేస్తున్నప్పటికీ పాలకులకు మాత్రం పట్టడం లేదు గత పది సంవత్సరాలుగా ఎంపీలకు మంత్రులకు పలు దఫాలు వినతి పత్రాలు అందించిన సమస్య పరిష్కారం కావడం లేదుఅనిప్రజల చేత సంతకాల సేకరణ చేసిన

స్పందించేదాకా నిధులు కేటాయించే వరకు పోరాటాలు కొనసాగించాలని అన్నారు. అలాగే జరిగినది కర్నూల్ టు విజయవాడ విజయవాడ టు కర్నూలు ఇంటర్సిటీ రైలు నడపాలని కాచిగూడ నుండి గుంటూరు దాకా వెళ్లే ప్యాసింజర్ రైలు ను విజయవాడ దాకా పొడిగించాలని మహబూబ్నగర్ నుండి విశాఖపట్నం వెళ్లే రైలు మహబూబ్నగర్ నుండి కర్నూలు దాకా పొడిగించాలని తుంగభద్ర రైలును కర్నూలు నుండి డోన్ దాకా పొడిగించాలని కర్నూలు నుంచి ఇండస్ట్రియల్ కారిడార్



మీదుగా ఓర్వకల్లును కలుపుకొని బేతంచెర్ల దాకా రైల్వే లైన్ పనులు ప్రారంభించాలని కర్నూల్ నుండి మంత్రాలయం వరకు రైల్వే లైన్ల పనులు ప్రారంభించాలని కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి రైల్వే శాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడు తీసుకొచ్చినటువంటి రైల్వే బాక్సుల తయారీ పరిశ్రమను తక్షణమే ప్రారంభించాలని

ప్రతి ఎక్స్ప్రెస్ రైలుకు పేదల ప్రయాణం చేసే విధంగా ముందర మూడు బాక్సులు వెనక సైడ్ మూడు బాక్సులు పేదల కోసం కేటాయించాలని అన్నారు ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో పార్టీ నగర కార్యవర్గ సభ్యులు భద్ర కుమార్ కృష్ణారెడ్డి మరియు సీనియర్ నాయకులు గిడ్డయ్య ఆచారి రామాంజనేయులు రబియా మజీద్ మియాట్రేడ్ ఆటో యూనియన్ నాయకులు ఈశ్వర్ రెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు

# అడ్వకేట్ స్వప్న ను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

### - తెలంగాణ సోషల్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు లంటు చంద్రశేఖర్ డిమాండ్.

**అందోల్ నియోజకవర్గం ప్రతినిది**

**. ఫిబ్రవరి 4 ( రిపబ్లిక్ న్యూస్)**



చేవెళ్ల కోర్ట్ లో అడ్వకేట్ గా ప్రాక్టీస్ చేస్తున్న స్వప్న ను హత్య చేసిన దుండగులను తక్షణమే కఠినంగా శిక్షించాలని ప్రముఖ న్యాయవాది, తెలంగాణ సోషల్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు లంటు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం జోగిపేట వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో DVMC సభ్యులు ఇమ్మయ్య, సామజిక నాయకులు పొట్టిగాళ్ల మోహన్, న్యాయవాది నక్క సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ తో సాధ్యం

### డాక్టర్ ఈబీ దేవి. డి ఎం అండ్ హెచ్ ఓ

**అనంతపురం వైద్యం, ఫిబ్రవరి 04, (రిపబ్లిక్ న్యూస్):**

అత్యంత ప్రమాదకర వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. వీటి మల్ల లక్షలాదిమంది ప్రజలు ప్రభావితమవుతున్నారు. ట్రిలియన్ల కణాలతో మానవ దేహంలో ఎక్కడైనా క్యాన్సర్ రావచ్చు. వ్యాధి నిర్ధారణ ముందస్తు గుర్తింపు వాటి గురించి ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం నిర్వహిస్తారు. సందర్భంగా క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుండి తెలుగుతల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఈ.బి. దేవి పాల్గొని ర్యాలీ నీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఈ బి దేవి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి నివారణకు స్క్రీనింగ్ ఎంతో ముఖ్యమని, క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ప్రమాదకారక కారణాలు, ముందస్తు నిర్ధారణ యొక్క ప్రాముఖ్యత,




ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించాల్సిన అవసరం, పొగాకు, మద్యం వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని, ముఖ్యంగా 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మహిళల్లో సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్, పురుషులలో ఓరల్ క్యాన్సర్ వంటి వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఈ సందర్భంగా డా. విష్ణు మూర్తి మాట్లాడుతూ, ఎన్ సి డి కార్యక్రమాల ద్వారా జిల్లాలో క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యంపై అవగాహనతో పాటు జీవనశైలి మార్పులు కూడా క్యాన్సర్ నివారణలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. శశిభూషణ్ రెడ్డి,

జిల్లా మలేరియా అధికారి ఓబులు, డిపిఎంఓ, శ్రీనివాసులు రెడ్డి, పరిపాలన అధికారి గిరిజ మనోహర్ , డెమో నాగరాజులు, ఎస్ ఓ మహమ్మద్ రఫీ, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, ఫ్లోరోసిస్ విభాగం ఆంజనేయులు, జిల్లా పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్త బి. శ్రీరాములు, ఆర్ బి ఎస్ కే మేనేజర్ రజిత, ప్రేమ్, కిషోర్, మౌనిక, శశికల, కార్యాలయ సిబ్బంది, పట్టణ ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎమ్ లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల వన దుర్గ అమ్మ వారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 4( రిపబ్లిక్ న్యూస్)**ఏడుపాయ వన దుర్గ అమ్మ వారిని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్ లు అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు ఆలయ మర్యాదలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది ఉన్నారు.



# తిరుపతి లడ్డు కల్తీ.. వైసిపి నీచ సంస్కృతి

## కల్తీ నెయ్యితో 20 కోట్ల శ్రీవారి లడ్డుల తయారి

## అహుడ చైర్మన్ టిసి వరుణ్ ఘాటు వ్యాఖ్యలు

## సిట్ నివేదికలో పాలు లేకుండా రసాయనాల కల్తీ





మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షులు, అహుడ చైర్మన్ టిసి వరుణ్ తదితరులు

**అనంతపురం ప్రతినిధి, ఫిబ్రవరి 04,(రిపబ్లిక్ న్యూస్):**
గత వైసిపి పాలనలో జంతు కొవ్వుల రసాయనాలతో తిరుపతి లడ్డు కల్తీ జరిగిందని ఉమ్మడి అనంతపురం జిల్లాఅధ్యక్షులు, అహుడ చైర్మన్ టిసి వరుణ్ మండిపడ్డారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు అనంతపురం ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమల తిరుపతి లడ్డు ప్రసాదంలోకి
 60 లక్షల కిలోల కల్తీ నెయ్యిని ఎలా సరఫరా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కొన్ని కంపెనీలకు నిబంధనలను మార్చుకొని నెయ్యి సరఫరా కాంట్రాక్ట్ ఇవ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఆవులు లేకుండా పాలు పెరుగు లేకుండా నెయ్యి ఎలా తయారవుతుందని ప్రశ్నించారు. అటువంటి కంపెనీలు వీరికిచ్చి దాదాపు 60 లక్షల కిలోల నెయ్యిని ఎలా సరఫరా చేశారని సూటిగా చురకలాంటించారు. నెయ్యి ప్రతి చుక్కలోనూ కల్తి జరిగిందని, రసాయనాలతో కూడిన నెయ్యిని పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేశారని మండిపడ్డారు. వెంకటేశ్వర స్వామిని వేడుకుని గత పాలకులు చేసిన తప్పును క్షమించండి అని చెప్పి పవన్ కళ్యాణ్ 2024లో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారన్నారు. తిరుపతి లడ్డు ప్రసాదంలో జంతువు కలిసిందని ఎన్ డి డి బి నివేదిక స్పష్టంగా ఇచ్చిందన్నారు. పవన్ కళ్యాణ్ చేసినటువంటి ప్రాయశ్చిత్త దీక్షను గత వైసిపి పాలక నాయకులు తప్పుదారి పట్టించారని అయితే దొంగలే దొంగ దొంగ అంటున్నట్టు వైసిపి వాళ్ల పరిస్థితి ఉందన్నారు.
అయితే తిరుపతి లడ్డు ప్రసాదంలో జంతు కొవ్వు కలిసిందని ఎన్ డిడి బి స్పష్టంగా నివేదిక ఇచ్చిందన్నారు. అందులో భాగంగా సిట్ నివేదికలో పాలు లేకుండా రసాయనాలతో కల్తీ చేశారని తేల్చారన్నారు. అదేవిధంగా కల్తీ నెయ్యిలో మోనో గ్లిజరైట్ అనే రసాయనాన్ని కచ్చితంగా కలిపారని, కొవ్వును 200 నుంచి 250 సెంటిగ్రేడ్ హీట్ చేస్తే దాని ద్వారా ఈ రసాయనాలు తయారు చేసినట్టు నిపుణులు తెలిపారన్నారు. ఇలాంటి రసాయనాలు వాడిన నెయ్యిని లడ్డులో వాడితే అది అపవిత్రం కాదా అని ప్రశ్నించారు. వైసిపి ఐదు సంవత్సరాల పాలనలో కోటి 61 లక్ష కిలోల నెయ్యి కొనుగోలు చేయగా.. అందులో 60 లక్షల కిలోల కల్తి నెయ్యి సరఫరా అయ్యిందన్నారు. ఈ కల్తీ నెయ్యితో 20 కోట్ల శ్రీవారి లడ్డులను తయారు చేశారని, ఘోర అపచారమని తీవ్ర అసంతృప్తిని వ్యక్తపరిచారు. 2019 నుంచి 2024 మధ్య
 కల్తీ ని సరఫరా చేసిన డైరీ కంపెనీలు, రాజకీయ నాయకులు వీరందరిపై సిట్ ఎంక్వైరీ నడుస్తోందన్నారు. హవాలాలో కొన్ని కోట్ల రూపాయలను ట్రాన్స్ఫర్ చేసినట్లు కూడా మీ అందరికీ తెలియాలని, హిందూ భక్తుల ఆత్మాభిమానం మనోభావాలను వైసీపీ నాయకులు కచ్చితంగా కూల్చారన్నారు. గత వారం రోజుల నుంచి జనసేన పార్టీపై, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై వైసిపి నాయకులు చేస్తున్న విమర్శలను ఉమ్మడి అనంతపురం జిల్లా జనసేన పార్టీ ఖండిస్తోందన్నారు.

### మీరు కటకటాల పాలయ్యే రోజు తొందరలోనే ఉంది

నగర అధ్యక్షులు పొదిలి బాబురావు మాట్లాడుతూ
కూటమి ప్రభుత్వంపై, జనసేన అధినే అధినేత పవన్ కళ్యాణ్ పై వైసిపి పార్టీ నాయకులు గత వారం రోజుల నుంచి అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన వైసిపి ప్రభుత్వం కల్తీ లడ్డు వ్యవహారానికి కారణమన్నారు. సున్నిత అంశం మీద సిట్ ఇచ్చినటువంటి నివేదిక మీద
ప్రకారం పామాయిల్, రసాయనాలతో కూడినవి కలిసాయని చెప్పారన్నారు. వైసిపి అనే అధినేత జగన్మోహన్ రెడ్డికి అధికార దాహం, ధన దాహం, రక్త దాహం... వంటికి అలవాటుపడ్డ వ్యక్తిని, గొడ్డలి పోటుకు చనిపోయిన వ్యక్తిని .. గుండెపోటు అని చిత్రించిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి, లడ్డు విషయంలో కల్తీ కాదని చిత్రీకరించడం పెద్ద విషయం ఏమీ కాదన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బ తీసేటువంటి మీరు చేసినటువంటి ఈ కుట్రకు తగిన మూల్యం చెల్లించుకోవాలన్నారు. వైసీపీ నాయకులు పదేపదే తప్పులను చేసి ఆ తప్పులను కప్పిపుచ్చేందుకు నీతి నిజాయితీ నిబద్ధతకు మారుపేరైనటువంటి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై మీరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఆంధ్రప్రదేశ్ ప్రజలు, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని కచ్చితంగా తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. అదేవిధంగా మీరు కటకటాల పాలయ్యే రోజు తొందరలోనే ఉందని, ఈ తప్పిదాలకు ఇప్పటికైనా సరే తిరుపతి చుట్టూ పొర్లు దండాలు వేసి, మోకాళ్ళ పై నడిచి మీరు ప్రాయశ్చిత్తం చేసుకుంటే తప్ప మీ పాపాలు పోవన్నారు. ఇంకొక్కసారి మా నాయకులపై జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పైన మీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నాలుకులను కచ్చితంగా కోయాల్సి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు.



జనసేన నగర అధ్యక్షులు పొదిలి బాబురావు



జనసేన వైస్ ప్రెసిడెంట్ ఈశ్వర్

### భక్తుల మనోభావాలను దెబ్బతీశారు

జనసేన వైస్ ప్రెసిడెంట్ ఈశ్వర్ మాట్లాడుతూ
శ్రీవారి లడ్డులో కల్తి నెయ్యిని కలిపి రాష్ట్ర ప్రజలనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని జనసేన వైస్ ప్రెసిడెంట్ ఈశ్వర్ మండిపడ్డారు. గత వైసిపి ప్రభుత్వం కల్తీ నెయ్యితో లడ్డను తయారుచేసి రూ 250 కోట్లకు పైగా డబ్బులను వసూలు చేసి అక్రమ దందాలు కొనసాగించారని, కల్తీ ద్వారా సంపాదించినటువంటి డబ్బులతో జేబులు నింపుకున్నారన్నారు. లడ్డులో కల్తీ నెయ్యి వ్యవహారాన్ని జనసేన నాయకులు పవన్ కళ్యాణ్ బయటికి తీసుకొస్తే జంతువు కొవ్వులతో కలిసిన రసాయనాలు కలిపారని సిట్ నివేదికలో వచ్చిందన్నారు. ఆ నివేదను బహిర్గతం చేసినా కూడా ప్రజల కళ్ళ గప్పి .. వైసిపి పార్టీకి నష్టం చేకూరుతుందనే దురుద్దేశంతోనే.. ప్రతి దాడి చేస్తున్నారని మండిపడ్డారు. తిరుమల తిరుపతిని అపవిత్రం చేసిన వారు ఎవరైతే ఉన్నారో వారందరినీ కూడా పేర్లతో సహా బహిర్గతం చేస్తే... ఈరోజు వాటన్నిటిని కూడా కప్పిపుచ్చుకునేందుకు ప్రజలను రెచ్చగొట్టే విధంగా, కుల మతాల మధ్య విధ్వంశాలను సృష్టించే విధంగా రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసేందుకు కుట్ర పన్నారన్నారు. వైసిపి పార్టీ నాయకులకు 11 సీట్లు ఇచ్చినా కూడా బుద్ధి రాలేదని, ప్రజలకు స్వచ్ఛందంగా క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర జిల్లా కమిటీ నాయకులు, డివిజన్ ఇన్ ఛార్జ్ లు, వీర మహిళలు, జన సైనికులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మికుల సమస్యకను పరిష్కరించండి

## అనంత గీత కులాల ప్రతినిధులు డిమాండ్

### రాయితీల, రిజర్వేషన్ల అంశాలను పరిష్కరించండి



**పశ్చిమగోదావరి, ఆచంట, ఫిబ్రవరి 04,(రిపబ్లిక్ న్యూస్):**
ఆచంట శాసనసభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ గారి నివాసాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీత కులాల ప్రతినిధులు సందర్శించారు. అందులో భాగంగా కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అనంతపురం కల్లుగీత కార్మికుల కులాల ప్రతినిధులు పితాని సత్యనారాయణ గారిని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు. బుధవారం ఆచంట నియోజకవర్గం పితాని మాజీ మంత్రి సత్యనారాయణ గారిని ఆయన నివాసంలో రాష్ట్ర గీత కులాల ప్రతినిధులు కలవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం నుండి కల్లుగీత కార్మికులకు ఐడి కార్డులు, టిసిఎస్, టి ఎఫ్ టి పెండింగ్ లైసెన్స్ లు రావలసిన రాయితీలు, రిజర్వేషన్లు తదితర అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా సహకరించాలని ప్రతినిధులు కోరారు. అదేవిధంగా గీత కార్మికుల సమస్యలపై మాజీ శాసనమండలి చైర్మన్ టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం గారిని, అలాగే రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి గారిని కూడా ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈడిగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకల వేణుగోపాల్, శ్రీశయన రాష్ట్ర అధ్యక్షులు లోడా అప్పారావు, యాత సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంగటి రాము, శెట్టి బలిజ రాష్ట్ర నాయకులు గుబ్బల బాబ్జి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి పేరు పెట్టాలని కేంద్ర మంత్రి కి ఎంపీ డాక్టర్ బైరెడ్డి వినతి



**ఓర్వకల్లు ప్రతినిధి,**
**ఫిబ్రవరి 4, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఈనెల 22న జరిగే భారత స్వాతంత్ర్య తొలి పోరాట వీరుడైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి సందర్భంగా, ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయంగా అనే పేరును అధికారికంగా ప్రకటించాలని బుధవారం న్యూ ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు ను కలిసి బుధవారం రోజు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ బ్రిటిష్ పాలనకు ఎదురు నిలబడి ప్రాణాలర్పించినఉయ్యాలవాడ నరసింహారెడ్డి త్యాగానికి ఇదే నిజమైన నివాళి అని కేంద్ర మంత్రికి వివరించారు

# ఓబులవారిపల్లి ఎండిఓ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్ జి ఎస్ డబ్ల్యూ జిల్లా అధికారి.







**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 4 రిపబ్లిక్ న్యూస్.**
ఓబులవారిపల్లి మండల అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని బుధవారం తిరుపతి జిల్లా స్వర్ణ గ్రామం మరియు స్వర్ణ వార్డు అధికారి జీవీ నారాయణరెడ్డి సందర్శించడం జరిగినది, మండల అభివృద్ధి అధికారి విజయరావు అధ్యక్షతన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే మరియు అక్షర ఆంధ్ర పలు సమస్యలపై సమీక్ష నిర్వహించడం జరిగినది, ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారి జి వి ఆదినారాయణ రెడ్డి మండల స్థాయి
 అధికారులతో ప్రభుత్వం సచివాలయము ద్వారా చేపడుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, అక్షరాంధ్ర, ఈకేవైసీ మరియు ఇంటి పన్నుల వసూళ్లు మొదలగు అంశములపై పనితీరును అడిగి తెలుసుకుని పలు సూచనలు వారికి చేయడం జరిగినది,అందులో భాగంగా యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ఈనెల 10వ తేదీలోగా అందరు సచివాలయం సిబ్బంది పూర్తి చేయాలని తెలియజేశారు. అలాగే అక్షరాంధ్ర వాలంటరీ రిజిస్ట్రేషన్ మరియు రిజిస్ట్రేషన్ వెంటనే కంప్లీట్ చేయాలని తెలియజేశారు. అలాగే సిటిజన్ ఈ కేవైసీ పూర్తి చేయాలని,
తర్వాత గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యదర్శులు మరియు సచివాలయం సిబ్బంది ఇంటి పన్ను వసూలు విషయమై ఇంటి పన్నును నగదు రూపంలో తీసుకోకుండా ఆన్లైన్, మరియు ఫోన్ పే ద్వారా మాత్రమే ఇంటి పన్ను చెల్లించాలని నగదు రూపంలో ఎవరికి చెల్లించరాదని, గ్రామ ప్రజలకు ఆయన తెలియజేశారు. ఆన్లైన్ ద్వారా లేదా ఫోన్ పే ద్వారా ఇంటి పన్ను చెల్లించిన వారికి రిసిప్ట్ కూడా ఆన్లైన్ ద్వారానే పొందవచ్చునని ఆయన అన్నారు.
చిన్నఓరంపాడు గ్రామపంచాయతీ కమ్మపల్లి హరిజనవాడ గ్రామంలో . ఎస్ జి ఎస్ డబ్ల్యూ అధికారి హాజరై ఇంటి పన్నును ప్రజల నుండి వసూలు చేస్తున్న తీరుతనులను ప్రత్యక్షంగా చూసి వారికి పలు సూచనలు చేయడం జరిగినది, అలాగే ఫిబ్రవరి 15వ తేదీలోపు ఇంటి పన్ను ప్రజల సహకారంతో వసూలు చేయడం పూర్తి చేయాలన్నారు, అలాగే యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ను తనిఖీ చేసి సచివాలయం సిబ్బందికి సూచనలు జారీ చేసి వారి నుండి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అక్షర ఆంధ్ర సర్వేను సత్వరమే పూర్తి చేయాలని వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ని హెచ్చరించడం జరిగినది, అనంతరం ఆయన చిట్వేలి మండల అభివృద్ధి కార్యాలయం సందర్శించి పై అంశములపై అధికారులతో సమీక్ష నిర్వహించి సమాచారాన్ని అడిగి తెలుసుకుని వారికి తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే మరియు ఇంటి పన్ను వసూలు అంశములపై సమాచారమును ప్రజలకు పత్రిక మరియు మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని మీడియా వారిని ఆయన కోరడమైనది. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు సచివాలయ సెక్రెటరీ బాలసుబ్రమణ్యం మరియు వారి సిబ్బంది పాల్గొనడం జరిగినది,

# రాష్ట్ర కార్యదర్శిగా కొలుసు మోహన్ యాదవ్ నియామకం

**ఉత్సాహంతో కార్యక్రమాలను వేగవంతం చేస్తాం**

**పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యం**

**వైసిపి కొలుసు మోహన్ యాదవ్ స్పష్టం**

**కృష్ణా జిల్లా (గన్నవరం), ఫిబ్రవరి 04,( రిపబ్లిక్ న్యూస్):**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ రాష్ట్ర కమిటీలో నూతన నియామకాలు చేపట్టారు. ఇందులో భాగంగా గన్నవరం నియోజకవర్గానికి చెందిన కీలక నాయకుడు కొలుసు మోహన్ యాదవ్ ను పార్టీ “రాష్ట్ర కార్యదర్శి (అనుబంధ విభాగాలు)“ గా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.



**వెనుకబడిన వర్గాల సమస్యలపై పోరాడటం**

పార్టీ ఆవిర్భావం నుండి క్రమశిక్షణ గల నాయకుడిగా మెలుగుతూ, గన్నవరం నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి మోహన్ యాదవ్ చేసిన కృషిని అధిష్టానం గుర్తించింది. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల సమస్యలపై పోరాడటంలో, అనుబంధ విభాగాల సమన్వయంలో ఆయన చూపిన చొరవకు గుర్తింపుగా ఈ రాష్ట్ర స్థాయి పదవిని కేటాయించారు.

**జగన్ ఆశయ సాధనే లక్ష్యం - కొలుసు మోహన్**

నియామకంపై కొలుసు మోహన్ యాదవ్ స్పందిస్తూ .. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అనుబంధ విభాగాలైన యువజన, విద్యార్థి, కార్మిక విభాగాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేస్తామని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

# ప్రతి పాఠశాలలో న్యూట్రీషన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలి

## ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-7 కింద మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలి

## ఫిబ్రవరి 10వ తేదీలోపు బిల్లుల అప్లోడింగ్ పూర్తి చేయాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల, ఫిబ్రవరి 4, (రిపబ్లిక్ న్యూస్):**
పిఎం శ్రీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా న్యూట్రీషన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో, పిఎం శ్రీ పాఠశాలల్లో 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫేజ్1, ఫేజ్2, ఫేజ్7 కింద మంజూరైన పనుల పురోగతిపై ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఇంజనీర్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఈఓ జనార్దన్ రెడ్డి, ఎస్ఎస్ఏ పీఓ నిత్యానంద రాజు, సమగ్ర శిక్ష ఈఈ సంపత్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు విడుదల చేస్తోందన్నారు. అందుకు అనుగుణంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ, మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఇంజనీర్లను ఆదేశించారు. ఫేజ్1 పనులకు సంబంధించి ఇంకా రూ.9.53 లక్షల మేర వ్యయం చేయాల్సి ఉందని, ఆ నిధులతో పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న న్యూట్రీషన్ గార్డెన్లు, మరుగుదొడ్లు, వర్షపు నీటి సంరక్షణ (రెయిన్




హార్వెస్టింగ్) తదితర పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫేజ్2 కింద మొత్తం 24 పనులకు మంజూరు చేయగా, కెమిస్ట్రీ ల్యాబ్, కంప్యూటర్ రూమ్, లైబ్రరీ, బయాలజీ ల్యాబ్ వంటి సదుపాయాలకు సంబంధించి ఇంకా రూ.2 కోట్ల 30 లక్షల వ్యయం చేయాల్సి ఉందన్నారు. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు పూర్తైన అనంతరం పాఠశాలకు అవసరమైన ప్రత్యామ్నాయ వసతుల కల్పనకు సంబంధించి ప్రధానోపాధ్యాయులు ఈఆఫీస్ ద్వారా ఫైల్ సమర్పించాలని సూచించారు. ముఖ్యంగా ఫిబ్రవరి 10వ తేదీలోపు బిల్లుల అప్లోడింగ్ తప్పనిసరిగా పూర్తి చేయాలని, లేనిపక్షంలో బిల్లులు అప్లోడ్ చేసే అవకాశం ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫేజ్7 కింద 21 పనులకు మంజూరు చేయగా, వాటి కోసం రూ.2.14 కోట్ల నిధులు కేటాయించారని, అందులో భాగంగా రూ.50 లక్షల మేర వ్యయం చేసేలా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జిల్లాలోని 44 పాఠశాలలకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మూడు విడతలుగా పనులు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఫేజ్3 కింద మంజూరైన నాలుగు పాఠశాలలను మినహాయించి, మిగిలిన 40 పాఠశాలల్లో చేపట్టిన పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీర్లను కలెక్టర్ ఆదేశించారు.

# త్వరలో ప్రారంభమయ్యే రెడ్ క్రాస్ జన ఔషధి మెడికల్ షాప్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ జిల్లా ప్రెసిడెంట్



**నంద్యాల, ఫిబ్రవరి 04 (రిపబ్లిక్ న్యూస్):-** నంద్యాల జిల్లా ప్రజలకు అత్యంత తక్కువ ధరకు నాణ్యమైన మందులను అందించాలనే లక్ష్యంతో నంద్యాల ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించనున్న ప్రధానమంత్రి జన ఔషధి మెడికల్ షాప్ రూమును బుధవారం జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ జిల్లా ప్రెసిడెంట్ జి. రాజకుమారి పరిశీలించారు. త్వరలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రారంభించబోయే మెడికల్ షాపుకు సంబంధించి కావలసిన సామాగ్రి ను, పనులను సమీక్షించారు లిఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాణ్యమైన మందులను తక్కువ ధరకే ప్రతి ఒక్కరికి అందించాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి జన ఔషధీ మెడికల్ షాపులను ప్రారంభిస్తున్నారని అందులో భాగంగా నంద్యాల ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించి ప్రజలకు అందుబాటులో తేవడం జరుగుతుందన్నారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, జిల్లా సెక్రెటరీ మరియు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరెంటెంట్ డాక్టర్ జిలాని భాష, రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ భాష, రెడ్ క్రాస్ డీఎఫ్ఓ సమీ, ఫార్మసిస్టు ఇంద్రజ, మున్సిపల్ ఇంజనీర్ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఒత్తిడికి గురి కావొద్దు - ఎంపీడీవో గాయత్రి



**బండి ఆత్మకూరు, ఫిబ్రవరి 4, (రిపబ్లిక్ న్యూస్):-** పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురి కావద్దని ఎంపీడీవో గాయత్రి సూచించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఎంపీడీవో బుధవారం స్థానిక కస్తూరిబా పాఠశాలను సందర్శించి విద్యార్థునీలకు పలు సూచనలు చేశారు. విద్యార్థినీలు ప్రణాళిక బద్ధంగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఏవైనా సబ్జెక్టుల్లో పాఠ్యాంశాలు మీకు అర్థం కానీయెడల ఉపాధ్యాయుల దృష్టికి తీసుకువెళ్లి అర్థవంతంగా చదవాలన్నారు. అప్పుడే మీరు నిర్ణయించుకున్న టార్గెట్ పూర్తి చేయగలుగుతారని ఆమె వివరించారు. ఈ క్రమంలో ఎంపీడీవో విద్యార్థినీల సామర్థ్యం తెలుసుకునేందుకు వారికి ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని ఆమె సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# సమిష్టి కృషితో మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేద్దాం





**మహానంది, ఫిబ్రవరి 4, (రిపబ్లిక్ న్యూస్)** మహానంది దేవస్థానంలో ఈనెల 13వ తేదీ నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహానంది ఆలయ వేద పండితులు రవిశంకర అవధాని, ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జున శర్మ, ఉప ప్రధాన అర్చకులు, అర్చకులు, సిబ్బందితో కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్లు, ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. అనంతరం దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానంది ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చేస్తామన్నారు. గత ఏడాది లాగే ఈ ఏడాది సమిష్టి కృషితో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. మహాశివరాత్రి రోజున మహానందీశ్వర స్వామికి జరిగే మహా లింగోద్భవం కాలంలో జరిగే అభిషేక కార్యక్రమంలో భక్తులకు నిరంతర దర్శనం ఏర్పాటు చేస్తామన్నారు. స్వామి, అమ్మవార్లకు జరిగే కళ్యాణోత్సవం ,రథోత్సవం, పుష్ప పల్లకి ఉత్సవం, తెప్పోత్సవం తదితర ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ని కలిసి పోస్టర్లు, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన అనంతరం వేద ఆశీర్వచనం చేసి ఉత్సవాలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మధు, ఉప ప్రధాన అర్చకులు మూలస్థానం శివశంకర శర్మ, ముఖ్య అర్చకులు మణికంఠ శర్మ, మూలస్థానం సుబ్బయ్య శర్మ, ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్ రెడ్డి, నీలకంఠేశ్వర రాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఈనెల 12న చాగంటి కోటేశ్వరరావు మహానందికి రాక:**
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, ప్రముఖ ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఈనెల 12వ తేదీన మహానందికి వస్తున్నట్లు ఆలయ వేద పండితులు రవిశంకర అవధాని తెలిపారు ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కళావేదిక సభా ప్రాంగణాన్ని ప్రారంభించిన అనంతరం తొలి కార్యక్రమంగా చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు ఉంటాయన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రవచనం జరుగుతుందని, నందీశ్వర వైభవం గురించి ఉపన్యాసం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు వినాలని విజ్ఞప్తి చేశారు.

# నిత్యాన్నదాన పథకంకు విరాళం

**మహానంది ఫిబ్రవరి 04 (రిపబ్లిక్ న్యూస్):-**
మహానంది పుణ్యక్షేత్రంలో కొనసాగుతున్న నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరాళం అందజేశారు. ఈవో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అనంతపురం కు చెందిన బీహెచ్ రాజారామ్ రూ.10,116 అందజేసినట్లు తెలిపారు. దాతలు మహానంది క్షేత్రం అభివృద్ధికి విరాళాలు అందించి సహకరించాలని కోరారు.



# నంద్యాల జిల్లాలో తొలి మహిళా హెవీ వెహికల్ డ్రైవర్‌గా లక్ష్మీదేవి

## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అభినందనలు

**నంద్యాల, ఫిబ్రవరి 04 (రిపబ్లిక్ న్యూస్):-**
నంద్యాల జిల్లాలో హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తొలి మహిళగా అరుదైన ఘనత సాధించిన లక్ష్మీదేవిని జిల్లా యంత్రాంగం తరపున జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి హృదయపూర్వకంగా అభినందించారు. బుధవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్ ఆవరణలో ఆమె సాధించిన ఈ విశిష్ట విజయాన్ని కలెక్టర్ కొనియాడుతూ, ఇది జిల్లాలోని మహిళలకు గర్వకారణమని తెలిపారు. సాధారణంగా ఆటో నడిపే స్థాయి నుంచి ప్రారంభించి, పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిన లక్ష్మీదేవి లారీ, బస్సు వంటి భారీ వాహనాలను నడిపే శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి, హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్‌ను పొందారని కలెక్టర్ పేర్కొన్నారు.
ఏ రంగమైనా మహిళలు వెనకడుగు వేయకుండా ధైర్యంగా ముందడుగు వేస్తే, విజయాన్ని సాధించగలరనే విషయానికి లక్ష్మీదేవి ఉదాహరణ అని అన్నారు. ఆమె సాధించిన ఈ విజయం ఎంతోమంది మహిళలకు, ముఖ్యంగా యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది" అని అన్నారు. పురుషాధిక్యంగా భావించే హెవీ వెహికల్



డ్రైవింగ్ రంగంలో మహిళలు కూడా ప్రతిభతో ముందుకు రావచ్చని లక్ష్మీదేవి నిరూపించారని కలెక్టర్ తెలిపారు. మహిళల సాధికారతకు ఇలాంటి విజయాలు దోహదపడతాయని, భవిష్యత్తులో మరింత మంది మహిళలు ఇలాంటి రంగాల్లో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. లక్ష్మీదేవి ధైర్యం, పట్టుదల, కష్టపడే తత్వం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా యంత్రాంగం పేర్కొంది.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించాలి

## ఉత్పాదన, సేవా రంగాల్లో 07 యూనిట్లకు రూ.34.30 లక్షల రాయితీలకు DIEPC కమిటీ ఆమోదం

## జిల్లా స్థూల దేశీయోత్పత్తి పెంపుకు ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు కీలకం

## కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌లో లక్ష్య సాధన దిశగా చర్యలు -జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి

**నంద్యాల, ఫిబ్రవరి 04( రిపబ్లిక్ న్యూస్) :-**
సింగిల్ డెస్క్ విధానంలో పరిశ్రమల అనుమతులకు సంబంధించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సమర్పించే దరఖాస్తులను నిర్ణీత గడువులోపే పరిష్కరించి, జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు సంపూర్ణ ప్రోత్సాహం అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (ఐ×జూాజ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఎస్. మహబూబ్ బాషా, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, ఎల్డీఎం రవీంద్ర కుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు తదితర వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 491 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానం ద్వారా 474 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 17 దరఖాస్తులను సంబంధిత శాఖలు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను



ఆదేశించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహంలో భాగంగా ప్రభుత్వ పథకాల ద్వారా పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్ చార్జీలపై సబ్సిడీ, సేల్స్ ట్యాక్స్ రాయితీలు వంటి ప్రయోజనాల కింద ఉత్పాదన మరియు సేవా రంగాలకు చెందిన 07 పరిశ్రమల యూనిట్లకు రూ.34.30 లక్షల రాయితీలను కమిటీ ఆమోదించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (ూవీజు-ూ) కింద జిల్లాలో 368 దరఖాస్తులు అందగా, వాటిలో 99 దరఖాస్తులకు రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. జిల్లా స్థూల దేశీయోత్పత్తి (+ఇూ) పెంపులో భాగంగా ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం (ూవీఖీవీజు) కింద ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, మహిళా పొదుపు సంఘాలకు ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం వరకు, గరిష్టంగా రూ.10 లక్షల సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 52 దరఖాస్తులను బ్యాంకులకు పంపగా, 27 దరఖాస్తులకు రుణాలు మంజూరు కావడం జరుగుతోందన్నారు.
లిజిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చే స్థానిక ఆహార ఉత్పత్తులపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. అలాగే రోజా, జాస్మిన్ వంటి పూల సాగు విస్తృతంగా ఉన్న నేపథ్యంలో సుగంధ ద్రవ్యాల తయారీ కేంద్రాల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎర్ర అటుకులు, నల్ల అటుకులు, మరమరాలు, మసాలా మరమరాలు, పచ్చిమిర్చి తొడిమ తీసే యూనిట్ల స్థాపనకు అవసరమైన చర్యలు చేపట్టాలని మెప్మా పీడీని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com